News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 02 | సంచిక :130 | ఖమ్మం | శుక్రవారం, జూన్ 28, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## ఫిరాయింపు పునాదులు

# కేసీఆర్‌వే..

**ఆయనకు సిగ్గుతోపాటు మతి కూడా తప్పింది**

- క్షమించాలంటూ ఆయన ముక్కు నేలకు రాయాలి
- ప్రభుత్వాన్ని కూలుస్తామని రంకెలేస్తే వదిలేయాలా!?
- లోక్‌సభ ఫలితాలతోనూ కేసీఆర్‌కు కనువిప్పు కలగలేదు
- విద్యుత్తు కమిషన్ వేయాలని అడిగిందే జగదీశ్ రెడ్డి
- విచారణకు ఇప్పుడు కేసీఆర్‌ను పిలవడంతో విమర్శలు
- గతంలో పక్క రాష్ట్రంలో పెట్టినట్లు రాజకీయ ప్రేరేపిత
- కేసులు తెలంగాణలో ఇప్పటి వరకూ లేవు
- పక్క రాష్ట్రం అభివృద్ధి చెందితే అసూయపడం
- తెలంగాణ అభివృద్ధిలో అలసత్వం ప్రదర్శించం
- క్యాబినెట్ విస్తరణపై అసలు చర్చలు జరగలేదు
- పీసీసీ చీఫ్‌గా సమర్థుడిని నియమించాలని కోరా
- కాంగ్రెసకు నష్టం చేయాలని చూసిన వారికి
- జీవన్ రెడ్డి అవకాశం ఇవ్వలేదు: సీఎం రేవంత్ రెడ్డి

సీకే న్యూస్ హైదరాబాద్ : "ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంలో కేసీఆర్ తీరు వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లుంది. కేసీఆర్‌కు సిగ్గుతోపాటు మతి కూడా తప్పింది. అసలు ఫిరాయింపులకు పునాదులు వేసింది కేసీఆర్ కాదా?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తమ పార్టీకి చెందిన 61 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను తీసుకున్నారని గుర్తు చేశారు. తాను చేసిన తప్పులకు క్షమించాలంటూ అమరవీరుల స్తూపం దగ్గరకు వచ్చి ముక్కు మూడించులు అరిగేలా నేలకు రాయాలని కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ

వివరాలు 2లో..



# చరిత్రలో రామోజీకి చిరస్థాయి

**విశాఖ చిత్రనగరికి ఆయన పేరు**
**అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం**
**రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు**
**ఎన్టీఆర్, రామోజీని తెలుగు జాతి మరవదు**
**వారిద్దరికీ భారతరత్న సాధించడమే మన లక్ష్యం**
**విజయవాడ సంస్మరణ సభలో సీఎం చంద్రబాబు**
**అమరావతిలో విగ్రహం పెట్టాలి: డిప్యూటీ సీఎం పవన్**
**రాజధానికి 10 కోట్లు విరాళమిచ్చిన రామోజీ కుటుంబం**

వివరాలు 2లో..

> "ఎన్టీఆర్‌ను, రామోజీరావును తెలుగు జాతి మరవబోదు. కృష్ణా జిల్లాలో జన్మించిన వారిద్దరికీ భారతరత్న సాధించడమే మనందరి కర్తవ్యం. నటులు, కళాకారులకు రామోజీరావు జీవితాన్ని ఇచ్చారు. ఆయన గౌరవార్థం విశాఖపట్నంలోని చిత్రనగరికి రామోజీ పేరు పెడతాం. రాజధానిగా అమరావతి పేరు ఆయనే సూచించారు. అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం. రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు పెడతాం" - చంద్రబాబు

సీకే న్యూస్ హైదరాబాద్ : ఉత్తమ పాత్రికేయ విలువలను సమాజానికి అందించిన ఈనాడు గ్రూపు సంస్థల అధిపతి రామోజీరావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎంచుకున్న ప్రతి రంగంలోనూ అగ్రస్థానాన్ని అధిరోహించారని, ఏ పని చేసినా అందులో ప్రజా హితం కోరుకున్నారని కొనియాడారు. "ఎందరో నటులు, కళాకారులకు రామోజీరావు జీవితం ఇచ్చారు. ఆయన గౌరవార్థం విశాఖపట్నంలోని చిత్రనగరికి రామోజీ పేరు పెడతాం. రాజధానిగా అమరావతి పేరు ఆయనే సూచించారు. అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం. రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు పెడతాం" అని చంద్రబాబు ప్రకటించారు. తెలుగు జాతి ఎన్టీఆర్‌ను, రామోజీని మరవబోదని వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లాలో జన్మించిన వారిద్దరికీ భారత రత్న సాధించడం

## 1.25 కోట్ల విలువైన మద్యం ధ్వంసం

కాకినాడ జిల్లాలో వివిధ కేసుల్లో ఎస్ఈబీ, పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన రూ.1.25 కోట్ల విలువైన అక్రమ మద్యం, నాటుసారాను ధ్వంసం చేశారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్‌తో తొక్కించేశారు. రెండేళ్ల కాలంలో స్వాధీనం చేసుకున్న 94,737 మద్యం బాటిళ్లు, 12,532.45 లీటర్ల సారాను ?ధ్వంసం చేశామని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సెబ్ శ్రీలక్ష్మి, పలువురు పోలీసు, సెబ్ అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఆరోగ్య కేంద్రం..

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**
**డీఎంహెచ్‌వోలతో సమీక్షలో మంత్రి దామోదర**



సీకే న్యూస్ హైదరాబాద్ :రాష్ట్రంలోని ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉండాలని, తదనుగుణంగా చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై

వివరాలు 2లో..



## బీజేపీతో రేవంత్

# కుమ్మక్కు..

**సింగరేణిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర**
**సంస్థను ప్రైవేటీకరించేందుకే బొగ్గు వేలం**
**నిరుద్యోగులకు కాంగ్రెస్ దగా: కేటీఆర్**

సీకే న్యూస్ హైదరాబాద్ : కేంద్రం అనాలోచిత నిర్ణయాలకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఆయన బీజేపీతో కుమ్మక్క య్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని.. సంస్థను ప్రైవేటీకరించే ప్రయత్నంలో భాగంగా తెలంగాణ బొగ్గు బ్లాకులను కేంద్రం వేలం వేసిందని పేర్కొన్నారు. తర్వాత సింగరేణి నష్టాల్లో ఉందంటూ పెట్టుబడుల ఉపసంహరణకు సిద్ధమవుతోందని ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో

వివరాలు 2లో..

## 'సీతారామ' ట్రయల్ రన్

# విజయవంతం

**బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి 9 వేల క్యూసెక్కుల పంపింగ్**

- త్వరలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు
- నా రాజకీయ ఆకాంక్ష నెరవేరబోతోంది: మంత్రి తుమ్మల
- ఎన్ని ఆటంకాలున్నా రైతుల రుణమాఫీ చేసి తీరుతాం



- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి..
- కొత్తగూడెంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభం
- నా ఆకాంక్ష నెరవేరబోతోంది: తుమ్మల

వివరాలు 2లో..

## అమరావతి నిర్మాణానికి రూ.10కోట్ల విరాళం ఇస్తున్నాం



అమరావతి దేశంలోనే గొప్ప నగరంగా మారాలని ఆకాక్షించారు ఈనాడు సంస్థల ఎండీ సీహెచ్ కిరణ్. విజయవాడలోని కానూరులో రామోజీ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. నవ్యాంధ్ర రాజధాని పేరును అమరావతిగా రామోజీరావు సూచించినట్లుగా

వివరాలు 2లో..

## చేసిన పాపాలు ఊరికే పోవు

- మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరెస్ట్
- మాచర్లలో వైసీపీ అరాచకాలకు తెరపడిందన్న ఉమ
- ఈవీఎంలు పగులగొట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శలు

వివరాలు 2లో..



## నాడు ఎన్టీఆర్‌ను గెలిపించినట్లే..

# మళ్లీ ప్రజలు ఆదరిస్తారు..

**ఓపికతో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి**
**పార్టీ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్**

సీకే న్యూస్ హైదరాబాద్ :ప్రజల్లో చైతన్యం వచ్చి బీఆర్ఎసను ఆదరిస్తారని అప్పటిదాకా ఓపికతో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, పట్టుదలతో ప్రజల మధ్యనే ఉండాలని నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ అధినేత,



వివరాలు 2లో..

## నీట్ పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షిస్తాం



- ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగంలో నీట్ లీకేజీపై స్పందన
- పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ఈ విషయంలో ప్రభుత్వం న్యాయమైన విచారణకు కట్టుబడి ఉందన్న రాష్ట్రపతి
- పరీక్షల ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహిస్తామని వెల్లడి

వివరాలు 2లో..

# 'సీతారామ' ట్రయల్ రన్ విజయవంతం

భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో గోదావరిపై నిర్మించిన సీతారామ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ విజయవంతమైంది. గురువారం బీజీ కొత్తూరు వద్ద ఉన్న మొదటి లిఫ్ట్ పంప్ హౌస్‌లోని ఆరు మోటార్లలో ఒకదానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో నీటి పారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, సీతారామ ఎత్తిపోతల చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి స్విచాన్ చేశారు. దీంతో.. గోదావరి నుంచి గ్రావిటీ కాల్వ ద్వారా పంప్‌హౌసకు చేరిన నీరు ప్రధాన కాలువలోకి దుంకింది. ఈ దృశ్యాన్ని చూసి మంత్రి తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. తన ఆకాంక్ష నెరవేరబోతోందన్నారు. అధికారులను అభినందించి భూ మాత, గోదావరి జలాలకు, సీతారామచంద్రస్వామికి నమస్కరించారు. సీతారామకు భూములిచ్చిన రైతుల త్యాగాన్ని కొనియాడారు.

వారికి పాదాభివందనం చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ పంప్‌హౌస్ ద్వారా 9 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను ఎత్తిపోస్తామన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు అనుసంధానం చేసి సాగర్ ఆయకట్టుకు నీరిస్తామని చెప్పారు. సాగునీటి శాఖ, జిల్లా మంత్రుల సహకారంతో రెండేళ్లలో సీతారామను పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో 10లక్షల ఎకరాలకు నీరిస్తామని వివరించారు. ఆగస్టు నాటికి ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం లిఫ్టలనూ అందుబాటులోకి తెస్తామన్నారు. ఏన్కూర్ లింక్ కెనాల్ పూర్తి చేసి చెరువులను నింపుతామని తెలిపారు. ఇల్లెందుకూ సాగునీరిచ్చే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

**ఫలించనున్న మంత్రి తుమ్మల కృషి**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7.88 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా దుమ్ముగూడెం (సీతారామ) నుంచి గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించడం తుమ్మల దశాబ్దాల కల. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడే దీనికి కృషి చేశారు. అప్పట్లో సాకారం కాకున్నా, తెలంగాణ ఏర్పడి ఆర్అండ్‌బీ మంత్రి అయ్యాక మళ్లీ ప్రయత్నం చేశారు. నాటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి మూడు భారీ లిఫ్టలతో రూ.13,500 కోట్లతో సీతారామ పనులు చేపట్టారు. మూడేళ్లు పనులు వేగంగా జరిగినా 2018 ఎన్నికల్లో తుమ్మల ఓటమి, గత ప్రభుత్వం కాళేశ్వరంపై దృష్టిసారించడంతో సీతారామకు నిధుల కొరత ఏర్పడింది. ఇటీవలి ఎన్నికల్లో గెలిచి మంత్రి అయిన తుమ్మల.. సీఎం రేవంత్ భద్రాచలం వచ్చినప్పుడు సీతారామ కు కొద్దిమొత్తంలో నిధులు కేటాయిస్తే ఈ ఏడాదే గోదావరి జలాలను సాగుకు అందించవచ్చని తెలిపారు. సీఎం అంగీకరించడంతో పనులు వేగిరమయ్యాయి. వైరా రిజర్వాయర్‌కు రూ.72 కోట్లు మంజూరు చేయించి ఏన్కూర్ లింక్ కెనాల్ పనులను ప్రారంభించారు. వీటిని ఆగస్టు 15కే పూర్తి చేయనున్నారు. పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌస్‌ల ట్రయల్ రన్‌కు చైనాకు చెందిన ఇంజనీర్లను రప్పిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ ఫలితమే సీతారామ ప్రాజెక్టుకు గోదావరి జలకళ అని కాంగ్రెస్ పేర్కొంది. జనవరి 7న సీఎం రేవంత్ ఈ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారని గుర్తు చేసింది. ఆరు నెలల్లో పూర్తయ్యేలా మంత్రి తుమ్మల కృషి చేశారని వివరించింది.

**కొత్తగూడెంలో రూ.130 కోట్లతో పనులు**

కొత్తగూడెంలో ఇంటింటికి తాగునీరు అందించేందుకు అమృత్ పథకం కింద రూ.125కోట్లతో చేపట్టనున్న పథకానికి ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. బైపాస్ రోడ్డు నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు రూ.4 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. భట్టితో పాటు మంత్రులు మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామన్నారు. 'రైతు భరోసా'పై అసెంబ్లీలో చర్చించి సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.

# ఫిరాయింపు పునాదులు కేసీఆర్‌వే..

- మొదటి పేజి తరువాయి

జీవన్‌రెడ్డితో కలిసి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులు కూడా మనుగడ సాగించదని కేసీఆర్, కేటీఆర్, హరీశ్ అన్నారు. దానికి బీజేపీ వంతపాడింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ బీఆర్ఎస్, బీజేపీలు రోడ్లపై రంకెలేస్తే గాలికి వదిలేయాలా?" అని రేవంత్ ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి 16 శాతానికి పడిపోయిందని, మొత్తం 17 సీట్లలోనూ ఓడిపోవడమే కాకుండా 8 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందని, 14 స్థానాల్లో మూడో స్థానానికి పడిపోయిందని, అయినా, కేసీఆర్‌కు కనువిప్పు కలగలేదని దుయ్యబట్టారు. పైగా, ప్రజలదే తప్పు అన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. "కేవలం కాంగ్రెసను ఓడించేందుకు బీఆర్ఎస్ నేతలు తమ ఓట్లను బీజేపీకి గంపగుత్తగా వేశారు. లేకపోతే, కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో బీజేపీకి ఫస్టు ప్లేసు వస్తుందా!? సిద్దిపేటలో బీజేపీ, బీఆర్ఎసకు సమానంగా ఓట్లు వస్తాయా? బీఆర్ఎస్ కంచుకోట మెదక్‌లో బీజేపీకి మెజారిటీ వస్తుందా!?" అని నిలదీశారు. కేసీఆర్‌కు ఇప్పటికైనా కనువిప్పు కలగాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. నిన్నటి వరకూ గేటు దగ్గరకు కూడా రానివ్వని ఎమ్మెల్యేలను ఇప్పుడు పిలిచి భోజనాలు పెట్టే పరిస్థితి కేసీఆర్‌కు తలెత్తిందని, తలుపులు మూసి కాళ్లు పట్టకుంటుండో, కడుపులో తలకాయ పెడుతుండో తనకు తెలియదని ఎద్దేవా చేశారు. "ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రమ్మన్నా రాడు. రాష్ట్ర అవతరణ దినోత్సవాలకు సైతం రాడు. రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో ప్రతిపక్ష నాయకులకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటాడు. దేశంలో ఎక్కడైనా ఈ సంప్రదాయం ఉందా? గత పదేళ్లలో ఎప్పుడైనా మమ్మల్ని పిలిచాడా? పదేళ్లు సీఎంగా పని చేసినందున సముచిత గౌరవంతో ఆహ్వానించాం. కేసీఆర్‌కు ఉద్యమ స్ఫూర్తి ఉంటే మేం పిలిచినప్పుడు హుందాగా వచ్చి అవతరణ వేడుకల్లో పాల్గొని ఉండేవాడు. సంబరాల్లో పాల్గొననివాడు.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోయాలని అనుకున్నవాడు తెలంగాణ బాగును ఎలా కోరుకుంటాడు?" అని నిలదీశారు. స్వార్థం, దోపిడీ, తన కుటుంబానికే అన్నీ ఉండాలన్న కోరిక.. ఇవన్నీ ఎల్లకాలం కేసీఆర్‌ను బతికించవని మండిపడ్డారు.

**విద్యుత్తు కమిషన్‌ను డిమాండ్ చేసింది జగదీశ్ రెడ్డే**

విద్యుత్తు కొనుగోళ్లపై విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని తాము ప్రతిపాదించలేదని, బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అసెంబ్లీలో సవాల్ విసిరి మరీ విచారణకు డిమాండ్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "కమిషన్‌ను ఏర్పాటు చేసిన మూడు నెలల వరకూ టీఆర్ఎస్, కేసీఆర్ ఏమీ మాట్లాడలేదు. కేసీఆర్‌ను వచ్చి వివరణ ఇవ్వాలని నోటీసులు పంపించిన తర్వాత ఆరోపణలు చేస్తున్నారు. విచారణ కమిషన్ వేయడం తప్పా? కేసీఆర్‌ను వివరణ ఇవ్వాలని అడిగినందుకు తప్పు పడుతున్నారా? జస్టిస్ నర్సింహా రెడ్డిని తప్పు పడుతున్నారా? బీఆర్ఎస్ నేతల మాటల్లోనే వ్యత్యాసం ఉంది. వాళ్లకే సమన్వయం లేదు" అని ఎద్దేవా చేశారు. వాళ్లు డిమాండ్ చేస్తేనే విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, అవకాశం వచ్చినప్పుడు ఒకరు శ్రీరామచంద్రుడు, మరొకరు సత్య హరిశ్చంద్రుడు అని నిరూపించుకుంటే సరిపోతుంది కదా? అని వ్యాఖ్యానించారు. జస్టిస్ నర్సింహా రెడ్డి కమిషన్లో లోపాలు ఏమైనా ఉంటే విచారణకు వెళ్లి కేసీఆర్ తన అనుభవాన్ని ఉపయోగించుకుని అద్భుతంగా వాదించుకోవచ్చు కదా అని అన్నారు. కేసీఆర్ కోరుకుంటే లైవ్ టెలికాస్టకు ప్రభుత్వం కూడా కమిషన్‌కు విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు.

**పక్క రాష్ట్రాల్లోలా రాజకీయ కేసులుండవు**

"తెలంగాణలో ఇప్పటి వరకూ ఎలాంటి రాజకీయ ప్రేరేపిత కేసులు నమోదు కాలేదు. గతంలో పక్క రాష్ట్రాల్లో జరిగినట్లు మా పాలనలో ఉండవు. చిన్న కేసు కూడా నమోదు కాలేదంటే మా పాలన బాగున్నట్లా? బాగా లేనట్లా?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపై త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకుని కేంద్రం నుంచి నిధులు, అనుమతులతో సహా ఏపీతో ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటామని, ఏపీ సర్కారుతో చర్చల పట్ల తమ ప్రభుత్వానికి ఎటువంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుతో వీలైన మేరకు సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకుంటామని తెలిపారు. "కేంద్రం వల్ల కూడా కాకపోతే సమస్యల పరిష్కారానికి కోర్టులున్నాయి. ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి వివిధ వేదికలను ఉపయోగించుకుంటాం. పక్క రాష్ట్రం అభివృద్ధి చెందితే అసూయ పడం. మా రాష్ట్ర అభివృద్ధి కోసం అలసత్వం ప్రదర్శించం" అని రేవంత్ వ్యాఖ్యానించారు. రోజుకూ 18 గంటలు కష్టపడుతూ తెలంగాణ పునర్నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. తనకు ఫాంహౌజ్‌లలో పడుకునే అలవాటు లేదని రేవంత్ ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రులతో చర్చలు సానుకూలంగా జరిగాయని, కంటోన్మెంట్‌లో 25 ఏళ్లుగా పెండింగులో ఉన్న ఎలివేటెడ్ కారిడార్లకు అనుమతులు తీసుకున్నామని, నిధులు విడుదల చేయించుకున్నామని, త్వరలోనే ప్రధానిని, హోం మంత్రిని కలవనున్నామని తెలిపారు.

# చరిత్రలో రామోజీకి చిరస్థాయి

- మొదటి పేజి తరువాయి

మనందరి కర్తవ్యమని స్పష్టం చేశారు. విజయవాడలోని కానూరులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రామోజీరావు సంస్మరణ సభకు సతీసమేతంగా చంద్రబాబు హాజరయ్యారు. రామోజీ రావు విలువలు, ఆయన సేవ భావి తరాలకు స్ఫూర్తి అని అన్నారు. నీతి నిజాయితీగా వ్యాపారం చేసిన ఆయన ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు 'మార్గదర్శి'పై గత ప్రభుత్వం కుట్ర చేసిందని గుర్తుచేశారు.

**ప్రజల పక్షపాతి: పవన్ కల్యాణ్**

ప్రజాస్వామ్యానికి పత్రికాస్వేచ్ఛ ఎంత అవసరమో ఈ దేశానికి రామోజీరావు చాటి చెప్పారని ఉపముఖ్యమంతి పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆయన ప్రజల పక్షపాతి అని తెలిపారు. జర్నలిస్టు విలువల్ని కాపాడిన ఆయన పత్రికాధిపతిగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఆరోగ్యం క్షీణిస్తున్న సమయంలోనూ... కూటమి విజయంపై ఆరా తీసినట్టు కుటుం బసభ్యులు చెబుతున్నారన్నారు. "మొదటిసారి 2008లో ఆయన్ను కలిశాను. 'నువ్వు ఏమి చేయాలనుకున్నావో, ఏం నమ్ముతున్నవో అది త్రికరణ శుద్ధిగా చేయి' అని సూచించారు. ప్రజ లకు ఏమి చేయాలో ఆయనకు స్పష్టత ఉంది.ఐదేళ్ల క్రితం లంచ్‌కు ఆహ్వానించినప్పుడు ఆయ నలో వేదన కనిపించింది. ఆయనను గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. అయినా తట్టుకుని నిలబడ్డారు. ఆయన విగ్రహం అమరావతిలో ఏర్పాటు చేయాలి. ఆర్టీఐ ఉద్య మకారుడిగానూ పోరాడిన రామోజీ ఒక పాత్రికేయ నదీ ప్రవాహం. అందులోంచి వీలైనన్ని నీళ్లు (పాత్రికేయ విలువలు) మనం తీసుకుని ఆయన వారసత్వాన్ని కొనసాగిద్దాం" అని వ్యాఖ్యానించారు.

**పరిశోధనాత్మక జర్నలిజం ఇష్టం: ఎన్.రామ్**

పరిశోధనాత్మక జర్నలిజాన్ని ఇష్టపడే రామోజీ రావు నమ్మిన విలువల కోసం కట్టుబడ్డారని హిం దూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్. రామ్ కొనియాడారు. "ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పాత్రికేయ హక్కుల కోసం బలంగా పోరాటం చేశారు. పాత్రికేయులే లక్ష్యంగా రాజీవ్ గాంధీ ప్రభుత్వం అప్పట్లో తెచ్చిన పరువు నష్టం బిల్లుకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ బిల్లులోని కఠిన నిబంధనలు ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, సాధించారు" అని గుర్తుచేశారు.

# నాడు ఎన్టీఆర్‌ను గెలిపించినట్లే.. మళ్లీ ప్రజలు ఆదరిస్తారు..

- మొదటి పేజి తరువాయి

మాజీ సీఎం కేసీఆర్ సూచించారు. ఒక ఎన్నికల్లో ఓడించి.. ఆ తర్వాత ఎన్నికల్లో అఖండ మెజార్టీ కట్టబెట్టిన విధంగా.. నాడు ఎన్టీఆర్‌ను ప్రజలు ఎలా గెలిపించారో.. అంతకన్నా గొప్పగా బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు తిరిగి ఆదరిస్తారని, ఆరోజు త్వరలోనే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా మర్కూర్ మండలంలోని ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నేతలు, ఆర్మూర్, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకుచెందిన కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాటాడారు. తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర బీఆర్ఎస్ సొంతమని, రాష్ట్రాన్ని సాధించిన ఘనత ముందు ముఖ్యమంత్రి పదవి అనేది తనకు పెద్ద విషయం కాదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. సమైక్య పాలనలో దిక్కు మొక్కులేని పరిస్థితి ఉండేందని, స్వరాష్ట్రంలోని బీఆర్ఎస్ పాలనలో అద్భుత ప్రగతి సాధించడంతోపాటు సాగునీరు, తాగునీరు, కరెంటు వంటి పలు కీలక వసతులను కల్పించుకున్నామన్నారు.ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారని, కొన్నిసార్లు ఇలాంటి తమాషాలు జరుగుతుంటాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని చెప్పారు. పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరడం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం తమ 25 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదని, అయిపోలేదని అన్నారు. ఏ పార్టీ అయినా నాయకులను సృష్టిస్తుందని.. అధికారంలో లేమని కొందరు పార్టీ వీడినంత మాత్రాన ఇబ్బందేమీ లేదని.. బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్లలాంటి కార్యకర్తలున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ బీ ఫాం ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయిలుగా తయారవుతారన్నారు.

**మినీ వ్యాన్ నడిపిన కేసీఆర్**

మర్కుక్: కేసీఆర్ డ్రైవింగ్ సీట్లో కూర్చొని స్టీరింగ్ పట్టడం ఎన్నడైనా చూశారా? గురువారం తన వ్యవసాయ క్షేత్రంలో ఆయన మినీ వ్యాన్ నడిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చిన తొలినాళ్లలో ఆయన స్నానాలగదిలో జారిపడటంతో గాయపడ్డ సంగతి తెలిసిందే. నెమ్మదిగా కోలుకున్న ఆయన ఇటీవల దాకా చేతికర్ర సాయంతోనే నడిచారు. వైద్యుల సూచన మేరకు ఇప్పుడిప్పుడే చేతి కర్ర లేకుండా నడవగలుగుతున్నారు. ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌసలో గురువారం సాయంత్రం కూడా కొంత దూరం నడిచారు. కొద్దిసేపటికి తన వద్ద ఉన్న పాత మినీ వ్యాన్ డ్రైవింగ్ సీట్లో కూర్చున్నారు. ఆ వాహనాన్ని నడుపుతూ ఫామ్‌హౌస్ కలియతిరిగారు. అలాగే వ్యాన్‌తో ఫామ్‌హౌస్ బయట రోడ్డు మీదకొచ్చారు. ఎర్రవల్లి సమీప గ్రామాలను సందర్శించారు.

# అమరావతి నిర్మాణానికి రూ.10కోట్ల విరాళం ఇస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

కిరణ్ వెల్లడించారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణానికి రూ.10కోట్లు విరాళం ప్రకటిస్తున్నామని కిరణ్ తెలిపారు. ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పరితపించిన వ్యక్తి రామోజీరావు అని చెప్పుకొచ్చారు. ఈ సభను ఏర్పాటు చేసినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కిరణ్ ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి రామోజీరావు ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లే సంకల్ప సభగా దీనిని భావిస్తున్నామని కిరణ్ అభిప్రాయపడ్డారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు కోర్టులో చుక్కెదురు

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు భుజంగరావు, ప్రణీత్ రావు, తిరుపతన్నలకు నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లను కోర్టు కొట్టివేసింది. పోలీసుల వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును నేటికి వాయిదా వేసింది. తాము నిబంధనల మేరకు 90 రోజుల్లోనే ఛార్జిషీట్ దాఖలు చేశామని పోలీసులు కోర్టుకు తెలిపారు.

# చేసిన పాపాలు ఊరికే పోవు

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి అరెస్ట్ నేపథ్యంలో, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా స్పందించారు. మాచర్లలో వైసీపీ అరాచకాలకు తెరపడిందని పేర్కొన్నారు. ఈవీఎంలను పగులగొట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని, చంబల్ లోయ మాదిరిగా సొంత సామ్రాజ్యంలా మార్చుకుని లెక్కకు మించిన తప్పులు చేశారని ఉమా విమర్శించారు. దాడులు, హత్యలతో అరాచకాలకు అడ్డాగా మార్చారని ధ్వజమెత్తారు. చేసిన పాపాలు ఊరికే పోవని, ఎన్నికల హింస కేసులో కటకటాల వెనక్కి వెళ్లారని పేర్కొన్నారు. తప్పులు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదు అంటూ దేవినేని ఉమా తన ట్వీట్ ను జగన్ కు ట్యాగ్ చేశారు.

గతంలో పల్నాడులో టీడీపీ నేతల కారుపై దాడి జరిగిన దృశ్యాలను, పిన్నెల్లి ఈవీఎంను పగులగొట్టిన క్లిప్పింగ్ ను కూడా ఉమా వీడియో రూపంలో పంచుకున్నారు .

# ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఆరోగ్య కేంద్రం..

- మొదటి పేజి తరువాయి

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో డీఎంహెచ్‌వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను అందించడంలో డీఎంహెచ్‌వోలది గురుతర బాధ్యత అని, ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో ఉండాలన్నారు.

ఆస్పత్రులను వైద్య సేవలపరంగా జిల్లా, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రుల లైసెన్సులను రద్దు చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ యాక్ట్, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# నీట్ పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షిస్తాం

నీట్ పేపర్ లీకేజీ అంశం దేశవ్యాప్తంగా ఎంతటి కలకలం సృష్టించిందో తెలిసిందే. ఈ అంశంపై పార్లమెంట్‌లో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన సమయంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందించారు. నీట్ పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షిస్తామని అన్నారు. అలాగే ప్రభుత్వం న్యాయమైన విచారణకు కట్టుబడి ఉందని తెలిపారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్షల ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహిస్తామని తెలిపారు."ఇటీవలి అవకతవకలు, పేపర్ లీక్‌లను దృష్టిలో పెట్టుకుని పరీక్షా విధానాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది" అని ముర్ము చెప్పారు. ఇలాంటి సంఘటనలు (ప్రశ్న పత్రాలు లీక్) చాలా రాష్ట్రాల్లో జరిగాయని చెప్పిన రాష్ట్రపతి.. రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇదిలావుంచితే, నీట్ పరీక్షలో రికార్డు స్థాయిలో 67 మందికి 720 మార్కులు రావడం, అందులోనూ ఒకే కోచింగ్ సెంటర్ నుంచి ఆరుగురికి ఇలా భారీగా మార్కులు స్కోర్ కావడంతో నీట్ పరీక్షపై లీకేజీ అనుమానాలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత విచారణలో ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలింది. 'సాల్వర్ గ్యాంగ్‌లు'గా పిలిచే క్రిమినల్ గ్యాంగ్‌లు ఇలా పేపర్ లీకేజీకి పాల్పడినట్లు తెలిసింది. దీంతో వారిని విచారించే బాధ్యతను ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో భాగంగా ఇప్పటివరకు బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర నుండి పలువురిని అరెస్టు చేశారు. బీహార్ నుండి అరెస్టయిన నలుగురిలో అనురాగ్ యాదవ్, అతని స్నేహితులు పరీక్షకు 24 గంటల ముందు ప్రశ్నపత్రం కాపీలు అందుకున్నట్లు అంగీకరించారు. రాజస్థాన్‌లోని కోటాలోని కోచింగ్ సెంటర్‌లో ప్రిపేర్ అవుతున్న యాదవ్.. తన మామ సాయంతో ప్రశ్న పత్రం పొందినట్లు తెలిపాడు.అరెస్టయిన వారిలో బీహార్‌కు చెందిన సనీవ్ ముఖియాను పోలీసులు ప్రధాన సూత్రధారుడిగా భావిస్తున్నారు. కాగా, మే 5న జరిగిన నీట్ పరీక్షకు దేశవ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక నీట్ వివాదం చెలరేగడంతో ప్రభుత్వం యూజీసీ-నెట్ పరీక్ష ఫలితాలను రద్దు చేసిన విషయం తెలిసిందే.

## బీజేపీతో రేవంత్ కుమ్మక్కు..

- మొదటి పేజి తరువాయి

సింగరేణి ప్రాంత పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో కేటీఆర్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి అభివృద్ధికి కృషి చేశామని, కేంద్రం ఒత్తిడి తెచ్చినా.. తెలంగాణ బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా ఆపగలిగామని తెలిపారు. కార్మికులతో కలిసి బీఆర్ఎస్ ఉద్యమించి సింగరేణిని కాపాడుకుంటుందని, ఇందుకుగాను ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని కేటీఆర్ వెల్లడించారు. 'అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ వేస్తాం. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలు పెడతాం. గ్రూప్-2లో రెండు వేలు, గ్రూప్-3లో 3 వేల ఉద్యోగాలు పెంచుతాం' అన్న రేవంత్‌రెడ్డి హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని ఆరోపించారు. గురువారం నందినగర్‌లోని తన నివాసంలో నిరుద్యోగులతో కేటీఆర్ సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని విపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన భట్టి విక్రమార్క ఇప్పుడు మాట నిలబెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు తిరగబడే రోజు వస్తుందని, వారికి మద్దతుగా కదం తొక్కుతామని కేటీఆర్ వెల్లడించారు.

**సీతారామ ప్రాజెక్టును 70% మేమే కట్టాం..**

ఉమ్మడి ఖమ్మం జిల్లా వరప్రదాయిని అయిన సీతారామ ప్రాజెక్టు పనులు తమ హయాంలోనే 70 శాతం పూర్తయ్యాయని, ఇప్పుడు ఆ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతం కావడం ఆనందంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ మహా సంకల్పం నెరవేరిన రోజు ఇది అంటూ గురువారం ఎక్స్ వేదికగా ప్రాజెక్టు విషయాలను ఆయన పంచుకున్నారు. ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు.

## కళాకారుడు గడ్డం మురళి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని ఆలేరు మాజీ ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే గొంగడి సునీత మహేందర్ రెడ్డి గారు పరామర్శ



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :** ఆత్మకూర్ మండలం తుక్కపురం గ్రామానికి చెందిన చిందు కళాకారుడు గడ్డం మురళి అనారోగ్యంతో మరణించగా. వారి కుటుంబానికి ఆలేరు మాజీ ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే శ్రీమతి గొంగిడి సునీత మహేందర్ రెడ్డి గారు విచ్చేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం ఈ కార్యక్రమంలో తుక్కుపురం మాజీ సర్పంచ్ చిక్కిరి రవి రహీంఖాన్ పేట మాజీ సర్పంచ్ మల్లెల పర్వతాలు గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుకల బాలరాజ్ మరియు సామ బుచ్చిరెడ్డి కుమ్మరి మల్లయ్య కొనగాని సోమయ్య యాట రాములు కలవల నరసింహ సంఘపాక సోమయ్య దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27,** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం నందు ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టుభద్రుల శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన తర్వాత మొట్టమొదటి సారిగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనం చేసుకొనడానికి విచ్చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు. అనంతరం స్వామి వారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ మామిడి పుల్లారావు, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు...

## శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో పారుపల్లి రేయాన్స్ జన్మదిన వేడుకలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27,** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా ఓసి-2 ఏ రిలే ఆపరేటర్ కట్టా వెంకటేశ్వర్లు రేణుక దంపతుల మనువడు పారుపల్లి రేయాన్స్ (లక్ష్మి రేవంత్ దంపతుల పెద్ద కుమారుడు) ఎనిమిదవ జన్మదిన వేడుకలు మణుగూరు మండలం లోని సంతోష్ నగర్, శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో గురువారం అమ్మమ్మ, తాతయ్యలు ఘనంగా నిర్వహించారు, విద్యార్థిని విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు, హాస్టల్ కు పాతిక కిలోల బియ్యాన్ని కూడా వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు, ఈ సందర్భంగా సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ కట్టా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను అభినందించారు, మన కుటుంబాలలో జరిగే ఏ కార్యమైనా నిరుపేద విద్యార్థిని విద్యార్థులతో పంచుకుంటే వారికి కూడా సంతోషం పంచిన వారు అవుతారని అన్నారు, అన్ని దానాల కన్నా విద్యా దానం మిన్న అన్న స్ఫూర్తితో మణుగూరు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ఆదివాసి, గిరిజన, తల్లి దండ్రులు లేదా తల్లో తండ్రో లేని అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని విద్యాభ్యాసం కళలు, క్రీడలలో శిక్షణ ఇచ్చి వారి ఉన్నతికి పాటుపడుతున్న పాఠశాల నిర్వహకులు బి జగన్మోహన్ రెడ్డిని సిబ్బందిని ఆయన ప్రశంసించారు, ఈ కార్యక్రమంలో కట్టా రేణుక,బొర్రా మంగాదేవి, పెండ్యాల లక్ష్మయ్య, మంగమ్మ, పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్ రెడ్డి, సుహాసిని దేవి, స్వాతి రాధా తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ చేసిన రేగు సిద్దులు.



**సి కే న్యూస్ రాజపేట(మహమ్మద్ జహంగీర్) జూన్ 27:** రాజాపేట (బంటు గూడెం) గ్రామానికి చెందిన.గొల్లన నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా.వారి కుటుంబానికీ గురువారం.రేగు సిద్దులు 50 కేజీల బియ్యం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సందిల భాస్కర్,గజ్జల రాజు,కర్రె కనకయ్య,పాండవుల బిక్షపతి,గొల్లెన రవి,ఎల్మ రాజు,స్వామి,బిక్షపతి,నర్సింలు,పెంట ఐలయ్య సోమయ్య,ప్రశాంత్,నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# రెండు లక్షలు రుణమాఫీ అమలు చేయాలి.

**అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ని జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికల ఆవిష్కరణ.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27,** జూన్- 30 నా మహబూబాబాద్ పట్టణంలో జరగబోయే అఖిల భారత రైతు కూలీ సంఘం ( ఏ ఐ కె ఎం ఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మిట్టపల్లి గ్రామం ఏ ఐ కె ఎం ఎస్ కమిటీ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బానోత్ ఊక్లా మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతుకు నాటి నుండి పాలకులు సున్నం పెడుతున్నారని దేశానికి రైతే వెన్నుముక అని పలుకుతూ ఆ వెన్నుముకను విరగగొడుతూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభం లోకి నేడుతున్నారని అనేక ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని దేశంలో రైతు అనే వానికి భరోసా లేకుండా పోయిందని బ్యాంకు రుణాలు అప్పుల బాధతో రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని వ్యవసాయ సంక్షోభం వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న కూలి ప్రజానీకం పై కూడా పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు బంధు తదితర రైతు సంక్షేమ పథకాలు పాలకులు హామీలకే పరిమితం చేశారని, రైతు బంధుతో రైతు బాగుపడింది లేదని తక్షణమే ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు భరోసా పేరుతో రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రైతు



భరోసా అందించాలని కేంద్రంలో ఎన్డీఏ కూటమితో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం గతంలో చేసిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని దేశంలో వ్యవసాయానికి పెద్ద పీట వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తరుణంలో జరిగిన గత ఉద్యమాలను సమీక్షించు కొని నూతన భవిష్యత్ కార్యాచరణ కై మహబూబాద్ పట్టణంలో జూన్ 30 న జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ని జయప్రదం చేయాలని ఈ కౌన్సిల్ కు అన్ని వర్గాల ప్రజలు తమ మద్దతును తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎం ఎస్ నాయకులు పునెం సమ్మన్న, నరసయ్య, తెల్లం రమేష్, కిన్నెర రామయ్య, సుక్కమ్మ, పునెం సుజాత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన పురుషోత్తపట్నం ప్రజా ప్రతినిధులు.



**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27,** ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, పురుషోత్తపట్నం సర్పంచ్ బుద్ధా ఆది నారాయణ, చేతుల మీద నుంచి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి, బాగా చదువుకొని మీ తల్లిదండ్రులకు, మీ సొంత ఊరికి, మంచి పేరు తీసుకురావడమే కాకుండా, మంచి ఉద్యోగాన్ని కూడా సంపాదించి జీవితంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. అంతేకాకుండా తల్లి తండ్రి, తర్వాత గురువు దైవం వీరి పట్ల విద్యార్థులు ఎల్లప్పుడూ గౌరవ మర్యాదలతో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, పురుషోత్తపట్నం సర్పంచ్ బుద్ధా ఆదినారాయణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, బుద్ధా దేవి, వార్డు మెంబర్ బుద్దాసాగర్, ఉపాధ్యాయులు, బద్ది ప్రసాద్, వెంకటరమణ, మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విప్పల సింగారంలో సింగరేణి వైద్య శిబిరానికి విశేష స్పందన.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27,** సింగరేణి సేవ సమితి మరియు సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు జనరల్ మేనేజర్ ప్రాంగన కార్యాలయ పరిధిలోని విప్పల సింగారం గ్రామంలో గురువారం సింగరేణి ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడినది.

ఈ సందర్భంగా సింగరేణి ఏరియా హాస్పిటల్ డాక్టర్ శేషగిరి రావు గ్రామస్తులతో మాట్లాడుతూ... సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక బాధ్యతగా ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ క్రమంలో భాగంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఆదేశం మేరకు మణుగూరు ఏరియా విప్పల సింగారం గ్రామం నందు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామస్తులు విశేషంగా స్పందించి స్త్రీ, పురుషులు, వృద్ధులు మొత్తం కలిపి 126 మంది వైద్య సేవలు అందించారు. సాధారణ సీజనల్ వ్యాధులతో పాటు బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఆయా వ్యాధుల నివారణకు ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఈ వైద్య శిబిరంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అయిదుగురు గ్రామస్తులను గుర్తించి ప్రత్యేక వైద్య పరీక్షల నిమిత్తం పివి కాలనీ, సింగరేణి కాలరీస్ ఏరియా హాస్పిటల్ కు రావాల్సిందిగా డాక్టర్ సూచిస్తూ వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించవలసిన ఆవశ్యకత పై గ్రామస్తులకు అవగాహన కలిపించారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి ఆసుపత్రి స్టాఫ్ నర్స్ శ్రీమతి రూపశ్రీ, నందిని ఇతర గ్రామ పెద్దలు, గ్రామస్తులు సోడే రవి కుమార్, వజ్జా నరేశ్, కారం లక్ష్మి నర్స్, మనమ్మ, ఝాన్సి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కు బంగారమైన బొగ్గు బ్లాక్ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలి.

**ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి జి రామయ్య పిలుపు .**




**సీ కే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునిర్.**

తెలంగాణలో సింగరేణి వేల వేయకుండా సింగరేణి సంస్థలకు అప్పజెప్పాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి ప్రభుత్వానిడిమాండ్ చేశారు. గురువారం స్థానిక నీలం రామచంద్ర భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారులకు వచ్చిన మోడీ ప్రభుత్వం దుర్మార్గమైన చర్య అని, ప్రజల సంపదలను ఆదానికి అంబానికి, అప్పనంగా అప్పజెప్పటం నీతిమైనా చర్యఅ ని,వారు అన్నారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మాత్రమే మేము చేస్తామని చెప్పటం నీతి భాహ్యమైన చర్య అని బొగ్గు బ్లాగులను సింగరేణి మాత్రమే చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

ఇప్పటికే ప్రైవేటీకరణ వలన కార్మిక కుటుంబాలు రోడ్డు ఫాలు చేస్తున్నారు. గోదావరి ప్రాంతానికి సహజ సంపద అయిన సింగరేణి రక్షణ కోసం కార్మిక వర్గం తిరుగుబాటు చేయాలని ప్రభుత్వ అధికారులతో ప్రజల సంపదను కాపాడాలని వారు కోరారు.

జిల్లా అధ్యక్షులు ఏ వెంకన్న మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేసి ఆలోచనను విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కార్మిక చట్టాల మార్పుపై కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి ప్రకటించాలని గ్రామపంచాయతీ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక వేతనాలు పెంచాలని వారి డిమాండ్ చేశారు పెరిగిన ధరల ను తగ్గించాలని అసంఘటిత రంగ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని వారు కోరారు. ఈ సమావేశంలో భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా నాయకులు సి వై పుల్లయ్య ఏ శరత్, హమాలి నాయకులు సూరిబాబు, సత్యం, విశ్వనాథం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లించాలి.

- జి ఓ నెం 51 రద్దు చెయ్యాలి.
- మల్టీ పర్పస్ విధానం రద్దు చెయ్యాలి.
- ఎ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి, నరాటి ప్రసాద్ డిమాండ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27,** అశ్వాపురం మండలం లోని వివిధ గ్రామ పంచాయితీ లలో కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటీ ప్రసాద్ డిమాండ్ చేశారు గురువారం ఉదయం స్థానిక యూనియన్ కార్యాలయం లో యెడల్లి శ్రీను అధ్యక్షత న జరిగిన మండల గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ %డ% వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం లొ ఆయన మాట్లాడుతూ జి ఓ నం. 51 నీ రద్దు చెయ్యాలని మల్టిపోర్పస్ విధానం రద్దు చెయ్యాలని కనీస వేతనం అమలు చెయ్యాలని ప్రతి కార్మికునికి ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేర్పుల మల్లికార్జున్ ఎం డి యూసఫ్, సీపీఐ మండల కార్యదర్శి, ఆనంటనేని సురేష్,

ఏఐటీయూసీ మండల, అధ్యక్షుడు రాయపూడి రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి, ఈనపల్లి పవన్ సాయి, ఏఐఎస్ఎఫ్ పినపాక నియోజకవర్గం కార్యదర్శి, అక్కినపల్లి నాగేంద్రబాబు,

సిపిఐ నాయకులు మేలపుర సురేందర్ రెడ్డి, రెడ్డి బోయిన వెంకన్న, యడెల్లి శ్రీను, తిప్పరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జటప్రోలు ఆలయం పై చెట్లను తొలగించండి

- ఎక్కడినుంచో ఇక్కడికి దర్శనానికి వస్తున్నారు
- వచ్చేది వర్షాకాలం ఇప్పుడు కాకపోతే మరో 3 నెలల్లో వృక్షాలు అవుతాయి
- తక్షణమే గ్రామ ఆలయ పాలక పెద్దలు చర్యలు తీసుకోవాలి
- సంస్థానాన్ని మరింత అభివృద్ధి గా చూడాలనుకుంటున్నాం



**సీకే న్యూస్ ప్రతినిధి, పెంట్లవెల్లి:** పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో శ్రీశ్రీశ్రీ మదన గోపాలస్వామి రాతి గోడలతో నిర్మించిన ఆలయం పై సుమారు 100 చెట్లకు పైగా మొలకలు ఎత్తి పెద్దవిగా అయ్యి, ఆ వేర్లు రాళ్ళ గోడల్లో చొచ్చుకొని పోయి పెద్దవిగా మారుతున్నాయనీ గ్రామ ప్రజలు ఒకరితో ఒకరు చర్చించుకుంటున్నారు వీటిని గ్రామ ఆలయ పాలక పెద్దలు ఆలయ చైర్మన్ తో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు ఆలయ పాలక పెద్దలకు తెలుపుతున్నారు ఎక్కడి నుంచో భక్తులు ఇక్కడికి ఆలయాన్ని గ్రామంలో ఉన్న పర్యాటక ప్రదేశాలను చూడడానికి వస్తుంటారు అంటూ తక్షణమే ఆలయ పాలకులు చెట్లను తొలగించే పని చేయాలని ఆలయ పాలకులకు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తెలుపుతున్నారు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోగలరు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్




**సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం :** నేడు కూసుమంచి మండలం పాలేరులోని బి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్లో చేపట్టే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర యువజన సర్వీసులు, టిజి ఎస్ టిఇపి, హైదరాబాద్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10.00 గంటల నుండి జాబ్ మేళా ఏర్పాటుచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఫార్మా, ఐటి, మార్కెటింగ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, కాల్ సెంటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, అడ్మినిస్ట్రేషన్, రియల్ ఎస్టేట్, రిటైల్, హౌజ్ కీపింగ్, స్టోర్ మేనేజర్, డెలివరీ బాయ్, వెల్డర్, ఫిట్టర్, చెఫ్, డ్రైవర్ మున్నగు విభాగాల్లో ఏమీ చదువుకొనని వారు మొదలుకొని పీజీ అర్హతలు కలిగిన యువతీ యువకులు ఇట్టి జాబ్ మేళా లో పాల్గొనవచ్చని ఆయన అన్నారు. ప్రాముఖ్యత జలిగిన 65 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని 5 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని, నిరుద్యోగ యువత ఉపాధికి ఇది సువర్ణావకాశమని అదనపు కలెక్టర్ తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు %ఫ్ట్రజూం://టశీతీఎం.స్త్రశ్రీవ/ఖఔ౧1బశీ5జూశీ6=తీ3ఇ% 6 లింక్ ద్వారా కాని లేదా క్రింద ఫోటోలోని క్యూఆర్ కోడ్ ను కానీ స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు హెల్ప్ లైన్ నెంబర్లు 8886711991, 9642333668 లను సంప్రదించాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ చేపట్టాలి

టి.జే.యు మండల అధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్



**సి కే న్యూస్ (సంపత్) జూన్ 27:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం రోజున తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మోటకొండూరు మండల కమిటీ అధ్యక్షులు గట్టికొప్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ...గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు పేరుకు మాత్రమే ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పంపిణీకి నోచుకోకపోవడం చాలా బాధాకరం అన్నారు.ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య వెంటనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ పంపిణికి శ్రీకారం చుట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కంది చంద్రకళ,జిల్లా కార్యదర్శి గుర్రాల నాగరాజు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## జులై 1నుండి అమలులోకి వస్తున్న 3 క్రిమినల్ మేజర్ చట్టాలను ఐలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

- రేపు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు మామిడి వెంకటరెడ్డి ఐలు జిల్లా అధ్యక్షుడు పిలుపు



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 27.** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు దేశ వ్యాపితంగా నిరసన ఉద్యమం చేయాలనే పిలుపుమేరకు యాదాద్రి జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేయాలని ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నూతన చట్టాల చట్టాలను అన్ని బార్ అసోసియేషన్ ల లో, జడ్జిలతో, ప్రజల్లో విస్తృతంగా చర్చ జరపాలని వారు అన్నారు మనువాదులు తమ ఫాసిస్టు ఎజెండాను క్రూరంగా అమలు పరచడానికి పోలీసు వ్యవస్థకు విశేష అధికారాలు కట్టబెట్టారు. తద్వారా ప్రజాస్వామ్య శక్తులకు ఏరకంగా భారత రాజ్యాంగ హక్కులు అందుబాటులో లేకుండా చేయపూనుకున్నారు. అందుకే టాడా, పోటా లాంటి ప్రత్యేక క్రూర చట్టాలను ఈ కొత్తచట్టాల రూపంలో జనరల్ చట్టాలుగా మార్చి అదే క్రూరత్వాన్ని, తీవ్రతను మొత్తం దేశ పౌరులందరిపై అమలుచేసి మొత్తం పౌరహక్కులను కాలరాయడమే ఈ చట్టాల అసలు ఎజెంఢా వారు అన్నారుఈ కొత్త క్రిమినల్ చట్టాలను అడ్డుకోవడం అత్యంత ఆవశ్యకం అని ఐలు భావిస్తున్నది.
న్యాయవాదులు, ఇతర ప్రజా బాహుళ్యం ఈ అంధోళనలో భాగస్వాములై వాటిరద్దుకై యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని కోరారులిఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కదువు సోమయ్య,తడక మోహన్, పాల్వంచ జగతయ్య,సహాయ కార్యదర్శులు బోల్లపల్లి కుమార్ సీసా శ్రీనివాస్ చింతల రాజశేఖర్ రెడ్డి బొడ్డు కిషన్ ఎండి నిహాల్ మల్లేశం తదితరు పాల్గొన్నారులి

## హెచ్చరిక బోర్డులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..- సిపిఎం డిమాండ్



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 27.** వలిగొండ తొర్రూర్ డబుల్ రోడ్డు వెడల్పులో భాగంగా అంబేద్కర్ విగ్రహం నుండి పవిత్రాత్మ పాఠశాల వరకు ఏర్పాటుచేసిన డివైడర్ కు ఎలాంటి హెచ్చరికల బోర్డులు,స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వెంటనే హెచ్చరిక బోర్డులు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పవిత్రాత్మ పాఠశాల ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు
ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ వలిగొండ నుండి తిరుమలగిరి వరకు నిర్మించిన డబల్ రోడ్డు నిర్మాణం లో భాగంగా వలిగొండ అంబేద్కర్ విగ్రహం నుండి పవిత్రాత్మ పాఠశాల వరకు ఏర్పాటు చేసిన డివైడర్ ముగింపులో ఎలాంటి హెచ్చరికల బోర్డు మరియు స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇటీవల ఒక టాటా ఏసీ బండి డివైడర్ పైకి ఎక్కిన పరిస్థితి ఉందన్నారు పాఠశాల ఉండటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి వెళ్తుంటారని స్పీడ్ గా వచ్చే వాహనాల వల్ల ప్రమాదం ఉందని వెంటనే రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్, మరియు ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి డివైడర్ ముగింపులో హెచ్చరిక బోర్డును మరియు పవిత్రాత్మ పాఠశాల ఆవరణలో స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు
ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం,మండల నాయకులు రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య,రంగారెడ్డి, సలిగంజి మురళీ కృష్ణ,నర్సింహా,ముత్యాలు తదితరులు పాల్గొన్నారు

## చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి.




**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 27.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ.
నీట్ ఎగ్జామ్ లో జరిగిన అవకతవకల గురించి,కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చెయ్యాలి అని,విద్యార్థులకి అండగా నిరసన వ్యక్తం చేస్తూ, అఖిలభారత యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బివై శ్రీనివాస్ గారి పిలుపుమేరకు, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారితో పాటు ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి(నల్గొండ), గడ్డం వంశీకృష్ణ(పెద్దపల్లి)రాష్ట్ర ఇంచార్జి సురభి, ఖలేద్,భువనగిరి పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ %ద% రాష్ట్ర ప్రధాన కార్యదర్శి "వెలిమినేటి సురేష్"యాదాద్రి జిల్లా అధ్యక్షుడు బర్రె నరేష్, బిబి నగర్ మండల్ అధ్యక్షులు కొండల్ రామ్ గారు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానం.

- కుల ధ్రువీకరణ పత్రాల జారీలో రెవెన్యూ అధికారులు పెడుతున్న ఇబ్బందులు ఆయన దృష్టికి భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు తో చరవాణిలో మాట్లాడిన తీన్మార్ మల్లన్న

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జూన్ 27,** నల్గొండ , వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గురువారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భద్రాచలం పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు మున్నూరు కాపు జిల్లా గౌరవ అధ్యక్షులు పిన్నింటి రాజశేఖర్ స్వగృహంలో ఉదయం తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు డివిజన్ అధ్యక్షులు దనపనేని వెంకటేశ్వర్లు తీన్మార్ మల్లన్నకు శాలువా కప్పి సత్కరించగా, భద్రాచలం పట్టణానికి చెందిన కాపు నాయకులు ఆడబాల వెంకటేశ్వరరావు, తమ్మల వెంకటేశ్వరరావు లు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఫోటో ను బహుకరించారు. అనంతరం వైద్యులు పిన్నింటి కమల రాజశేఖర్ లు రాముల వారి ఉత్తరేణి, స్వామి వారి ప్రతిమలు, కల్యాణ తలంబ్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులు చదువుకునే తమ పిల్లలకు మున్నూరు కాపు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసే విషయంలో రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మల్లన్న దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన మల్లన్న వెంటనే ఆర్డీవో దామోదర్ రావు తో తన చరవాణితో మాట్లాడారు. మున్నూరు కాపు కులస్తులకు ఇచ్చే సర్టిఫికెట్ల విషయంలో ఎటువంటి ఇబ్బందులకు గురి చేయవద్దని రెవెన్యూ అధికారులకు తగు సూచనలు చేయాలని తెలిపారు. తీన్మార్ మల్లన్న కలిసిన వారిలో మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు పూదోట సూరిబాబు, బూర్గంపాడు, పినపాక, చర్ల మండలాల మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు వారాల వేణు, బొడ్డు ఏసుబాబు, నాగభూషణం, కాపు నాయకులు ఎర్రం శెట్టి కృష్ణ, బందారు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## గుడిపూడి గాంధీ కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల .



**సీ కే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునిర్.** స్థానిక దుర్గ మెడికల్స్ గాంధీ తండ్రి అయిన గుడిపూడి దుర్గారావు స్వర్గస్తులైనారు ఎన్టీఆర్ జిల్లా కొండూరు గ్రామంలో గురువారం స్వర్గీయ దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి గాంధీ కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు .మంత్రి తుమ్మల వెంట సీనియర్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు , చలసాని సాంబశివరావు , గ్రామ పెద్దలు పాలుగున్నారు.

## ఆదర్శమూర్తి,అసాధారణ ప్రతిభాశాలి "హెల్లన్ కెల్లర్"

- ధరణకోట నర్సింహ వి.హెచ్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు



**సి కే న్యూస్ (సంపత్) జూన్ 27 :** చిన్న తనం నుంచే మూడు రకాల వైకల్యాలను జయించి,అసాధారణ ప్రతిభను కనబర్చిన హెల్లన్ కెల్లర్ జీవితం మనకు ఆదర్శం కావాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులధరణికోట నర్సింహ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో జరిగిన "హెల్లన్ కెల్లర్" 144 వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్లన్ కెల్లర్ పుట్టుకతోనే చెవుడు,మూగ, అంధత్వం కల్గి ఉన్నా, అధైర్య పడకుండా ఆమె వికలాంగుల, మహిళల హక్కుల కోసం కృషి చేసారని ఆయన అన్నారు. హెల్లన్ కెల్లర్ రచయితగా, సంఘసంస్కర్త గా చేసిన సేవలు మరువలేనివని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు కొడారి వెంకటేష్,వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు జాగిళ్ళపురం అయిలయ్య, నాయకులు వెంకటేశ్వర్లు , విద్యార్థులు పాల్గొన్నారు.

## అడిషనల్ కలెక్టర్ గంగాధర్ ను సన్మానించిన వంగపల్లి అంజయ్య స్వామి...




**సి కే న్యూస్ ఆలేరు నియోజకవర్గం ప్రతినిధి (సందెన శంకర్) జూన్ 27,**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం అడిషనల్ కలెక్టర్ గంగాధర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ గంగాధర్ కు శాలువాతో సత్కరించి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీ పీ ఓ, ఎంపిడిఓ, ఏం పీ ఓ, గ్రామ సెక్రటరీ దివ్య , స్వామిదాస్, రాజు, బాల్ రెడ్డి, శ్రీశైలం, శంకరయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కల్ప వృక్ష నారసింహస్వామి వారిని దర్శించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27,** భద్రాచలంలో కొలువైన కోరిన కోరికలు తీర్చే కల్పవృక్ష నరసింహ సాలగ్రామమూర్తిని బుధవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దర్శించి ప్రత్యేక పూజలు చేయడం జరిగినది. ఎమ్మెల్సీ ఎన్నికల ముందు మల్లన్న విజయం సాధించాలని వారి అనుచరులు కల్పవృక్ష నారసింహునికి ముడుపులు కట్టడం జరిగినది.ఎమ్మెల్సీ గా గెలిచిన తరువాత నేడు భద్రాచలం వచ్చిన మల్లన్న స్వామివారిని దర్శించి ముడుపులు కట్టి మొక్కలు చెల్లించుకోవడం జరిగినది.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రతి ఒక్కరూ బాగుండాలని, వర్షాలు సమృద్ధి గా కురిసి మంచి పంటలు పండాలని విద్య,వైద్యం వ్యవసాయ వ్యాపార రంగాలలో రాష్ట్రం ముందుకు సాగాలని స్వామి వారికి ముడుపు కట్టానని అన్నారు,మల్లన్న తో పాటు వారి అనుచరులు సైతం స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు

## దూది వెంకటాపురం లో వాటర్ ప్లాంట్ ప్రారంభం



**సి కే న్యూస్ రాజాపేట.(మహమ్మద్ జహంగీర్) జూన్ 27 :** మండలంలోని దూది వెంకటాపురం గ్రామంలో బాలవికాస్ హైదరాబాద్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, మధుసూదన్ రెడ్డి వినోద్ రెడ్డి సహకారంతో గురువారం వాటర్ ప్లాంట్ ను ఎంపిటిసి ఎర్రోళ్ల స్వరూప బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బాలవికాస్ సంస్థ ప్రతినిధులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరగదిండ్ల వెంకటేష్, కుమారులు రాజు లక్ష్మణ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంస్థ సిటీ డైరెక్టర్ బూడిద వెంకటేష్, మాజీ ఎంపీపీ ఊకంటి అరుణ బుచ్చిరెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి భరత్ కుమార్, కార్యదర్శి చక్రిధర్, నాయకులు కటుకూరి బాల నరసయ్య, మంగళపల్లి చంద్రమౌళి బొమ్మకంటి బిక్షపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిందితున్ని చర్లపల్లి జైలుకు తరలించిన రాచకొండ పోలీసులు.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 27.**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ... తన వ్యక్తిగత అవసరాల కోసం స్థానిక కాంట్రాక్టర్ లను, ప్రభుత్వ ఉద్యోగులను , మహిళల ను టార్గెట్ చేస్తూ డబ్బులు వసూలు చేసుకుంటూ బెదిరింపులకు %ాజ /ాు% కేసులు పెడితనని బెదిరింపులకు పాల్పడుతున్న వేములకొండ గ్రామానికి చెందిన వేముల నరేందర్ (43 ) అనే వ్యక్తి పై ప్రివెంటివ్ డిటెన్షన్ ( %ూణ%) యాక్ట్ ప్రయోగించిన రాచకొండ పోలీసులు..

స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం

వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో వేములకొండ గ్రామానికి చెందిన వేముల నరేంద్ర (43) అనే వ్యక్తి తన వ్యక్తిగత అవసరాల కోసం కాంట్రాక్టర్లు ప్రభుత్వ అధికారులను బెదిరింపులకు పాల్పడుతూ వారి వద్ద నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ %ాజ /ాు% కేసులు పెడుతనాని బెదిరింపులకు పాల్పడుతూ , మహిళలను మానసికంగా, శారీరకంగా బెదిరింపులకు పాల్పడుతున్నడని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి పై కేసునమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ తరలించించిన పోలీసులు..

రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఆదేశాల మేరకు నిందితునిపై %ూణ% నెంబర్ 6/%ూణ -జవశ్రీశ్రీ / =జఖణ%/2024 యాక్ట్ వలిగొండ మండలం వేముల కొండ గ్రామానికి చెందిన వేముల నరేంద్ర (43) అనే వ్యక్తి పై %ూణ% చట్టాన్ని ప్రయోగించిన రాచకొండ పోలీసులు...

లి నిందితున్ని నల్గొండ సబ్ జైల్ నుండి చర్లపల్లి జైల్ కు తరలించిన రాచకొండ పోలీసులు పోలీసులు..

## ఇష్టంసారంగా ప్రవేట్ స్కూల్లో ఫీజులు వచ్చేస్తున్న యజమాన్యం పట్టించుకోని పాలకవర్గం

- ప్రైవేట్ పాఠశాలల ఫీజులు నియంత్రించాలని షాద్ నగర్ యువసత్తా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో దీక్ష
- 6 నుండి 14 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత విద్యను అందించాలి సాయి ప్రసాద్





**సి కే న్యూస్ షాద్ నగర్ :జూన్ 27:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లో ప్రైవేట్ పాఠశాల ఫీజులు నియంత్రించాలని షాద్ నగర్ యువసత్తా అధ్యక్షులు లక్ష్మణ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. యువసత్తా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులు ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఉన్నత చదువులు చదవాలని ప్రైవేట్ పాఠశాలని ఆశ్రయిస్తే వారి అవసరాన్ని ఆసరగా తీసుకొని ప్రవేట్ పాఠశాలలు చేస్తున్న డిమాండ్ మంచిది కాదన్నారు. షాద్నగర్ పాఠశాలలో ఉండే ఉపాధ్యాయులు ఒక్కసారి ఆలోచించాలి హైదరాబాద్ తరాలు ఫీజులు వసూలు చేయొద్దని తెలిపారు.ఇరుకైనా గదులు,గాలి వచ్చి పోయే అవకాశం లేదు.ఫీజులు ఆలస్యం ఐతే విద్యార్థిని అంటరాని వాడిగా బయట నిలబెట్టి అవమానించిడం, ప్రశ్నించడం చేతకాని తల్లి తండ్రులు,పిల్లల ప్రాణాలకు గ్యారంటీ లేదు. పదవ తరగతి ఫలితాలు వచ్చి ఎన్ని రోజులు అయినప్పటికీ ఇప్పటివరకు వాళ్లకు టీసీలు అందజేయలేదని వాపోయారు. కొద్ది రోజుల కిందట మేద పాఠశాలలో జరిగిన విద్యుత్ షార్ట్ కొట్టడంతో ఆసుపత్రిలో ఉన్నాడు, అతనికి సంబంధించిన ఖర్చులు అన్ని మేద పాఠశాల యజమాన్యం భరించాలని కోరారు. ఈ దీక్షలోరిటైర్డ్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ సాయి ప్రసాద్, పాలమాకుల్ సారా వినయ్ కుమార్, ఆర్టిఐ యాక్ట్ జంగయ్య అడ్వకేట్, రహమతుద్దీన్ అడ్వకేట్, త్రివేది నరసింహ, జంగయ్య టియం ఎమ్మార్పీఎస్, సూర్య నాయక్ గిరిజన నాయకులు, చెన్నగల అశోక్ ఎమ్మార్పీఎస్, బిఆర్ ఎస్ యువ నాయకులు ప్రవీణ్, ఉదయ్, శ్రీకాంత్, ఇంద్ర, ఇంతియాజ్, రవితేజ, రాజు, యువసత్తా ప్రధాన కార్యదర్శి మాధవాచారి, కందివనం నవీన్ కుమార్,సిద్దు గౌడ్, రాములు గౌడ్, రమేష్, అభినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## "జటప్రోలు" గ్రామాన్ని పర్యాటక కేంద్రం చేయండి మంత్రి గారూ....పర్యాటకం మీ చేతుల్లోనే

- మంత్రి జూపల్లి గారూ పర్యాటకం మీ చేతుల్లోనే ఉంది కదా...?
- గతంలో గ్రామం మండలం అవుతుందని ఆశపడ్డాం
- జటప్రోలు గ్రామాన్ని పర్యాటక ప్రాంతం గా చేయండి
- దూర ప్రాంతాల ప్రజలు దర్శనాలకు వస్తున్నారు
- గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయండి
- గ్రామంలో ఆలయం ,శివాలయాలు రెండు దర్గాలు, కత్వ, మొ.. చూడదగ్గ ప్రదేశాలు
- ప్రస్తుతం గ్రామంలో షార్ట్ ఫిలిమ్స్ కూడా జరుగుతున్నాయి
- పర్యాటక శాఖా మంత్రి జుపల్లికి తెలుపుకున్నా గ్రామ యువకులు , ప్రజలు

**సీకే న్యూస్ ప్రతినిధి, పెంట్లవెల్లి:** పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామం (జటప్రోలు సంస్థానం) చాలా చూడదగ్గ ప్రదేశం . ఇక్కడ రాష్ట్రంలో ఎక్కడ లేనటువంటి శ్రీశ్రీశ్రీ మదన గోపాలస్వామి ఆలయం ఉందని అలాగే ఇది రాజుల సంస్థానం గా పేరుగాంచినది. విషయానికి వచ్చినట్లయితే గ్రామ ప్రజలు గతంలో ఈ జటప్రోలు సంస్థానాన్ని మండల కేంద్రంగా చూడాలన్న ఆశతో ఉంటే, మండలం కాలేకపోయింది ఎంతో ఆశతో గ్రామ ప్రజలు ఎన్నో రకాల ప్రయత్నాలు చేసిన మండలం కాలేకపోయింది అయితే ఎలాగైనా గ్రామాన్ని కచ్చితంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుకోవాలని గ్రామ ప్రజలు చాలా రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు . ప్రస్తుతం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నియోజకవర్గ మంత్రి అయినందున ఈసారి కచ్చితంగా పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుకోవాలని గ్రామ ప్రజలు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామంలో గ్రామ యువకుడు సులిగిరి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ మంత్రి జూపల్లి సొంత నియోజకవర్గం లో అయినా ఈ జటప్రోలు సంస్థానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని , ప్రస్తుతం ఆ పర్యాటక శాఖ ఆయన చేతుల్లోనే ఉందని వారు ఖచ్చితంగా ఈ పని చేయాలని గ్రామ యువకుడు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ తెలిపారు అనంతరం ఆయన గ్రామ ప్రత్యేకతలను ఈ సందర్భంగా తెలుపుతూ... ఈ ఆలయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి తెలిసిందే. ఈ ఆలయం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏడు అంతస్తులు ఉందని చెప్పవచ్చు అయితే ఈ ఆలయ సంస్థానానికి గొప్ప చరిత్ర కలదని కూడా చెప్పవచ్చు వివరాల్లోకి వెళ్ళినట్లయితే రావణాసురుడు సీతాదేవిని అపహరించుకొని వెళు తున్నప్పుడు జటాయువు అనే పక్షి ఆ రావణాసురుడికి అడ్డుపడి సీతాదేవిని కాపాడబోతే రావణాసురుడు ఆ జటాయువూ రెక్కను కత్తితో నరకడం ద్వారా ఆ రెక్క ఈ జటప్రోలు గ్రామంలో పడిందని గ్రామ పురాతన పెద్దలు ప్రతి ఒక్కరికి చెప్పుకునే అంశం ఈ జటప్రోలు గ్రామ స్పెషల్ అని తెలుస్తుంది .అయితే ఇక్కడ ఉన్న ఆలయాన్ని సందర్శించుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచో వచ్చి ఆలయాన్ని దర్శించుకుని వెళు తుంటారు మరియు ఇక్కడికి వచ్చి షార్ట్ ఫిలిమ్స్ తీస్తుంటారని కూడా చెప్పవచ్చు అలాగే గ్రామ ఆలయ సమీపంలో గొప్పగా ప్రసిద్ధిగాంచిన రెండు దర్గాలు ధర్వేష్ ఖాద్రి , మాసం బాబా, దర్గాలు ఉన్నాయని కూడా చెప్పవచ్చు అలాగే గ్రామంలో ఈ మధ్య "కత్వ" అనే ప్రదేశాన్ని చూడడానికి చాలా మంది చాలా దూరం నుంచి వస్తూ ఉన్నారు ఈ కత్వ దగ్గర పంట పొలాలకు వెళ్లే నీళ్లు వాటర్ ఫాల్ మాదిరిగా ప్రజలను ఆకట్టుకునే విధంగా ఉందని ఆయన తెలిపారు ఈ ఊర్లో ఇక్కడ అన్ని ప్రదేశాలు చూడదగ్గ ప్రాంతాలు. అందుకూ ప్రతి ఒక్కరికీ ఈ జటప్రోలు గ్రామం అధ్భుతంగా ఉందనేలా మేము చెప్పుకోవాలని గొప్ప పర్యాటక కేంద్రాలుగా, ప్రదేశాలుగా,తీర్చి దిద్దలని స్థానిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కి గ్రామ యువకుడు శ్రీనివాస్



తెలుపుకున్నారు అంతే కాకుండా పర్యాటక శాఖ మీ చేతుల్లోనే ఉంది , సొంత నియోజక వర్గం అయినా జటప్రోలు గ్రామం పై ప్రత్యేక శ్రద్ధ వహించి జటప్రోలు (సంస్థానం) గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన మాట్లాడుతూ తెలిపారు

## సహజ సంపదను నాశనం చేసే హక్కు ఎవరిచ్చారు..?

- దేవాలయాన్ని నేల మట్టం చేశారు
- ఇకనైనా విధ్వంసం ఆపండి
- షాద్ నగర్ పట్టణ శివారులోని చౌడమ్మ యాడి గుట్టపై విధ్వంసాలు సృష్టించొద్దు
- అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా చర్య తీసుకోవాలని డిమాండ్
- మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, బిజెపి కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య తదితరులు ఆగ్రహం

**సి కే న్యూస్ :** వ్యాపార స్వప్రయోజనాల కోసం ప్రకృతిని తొలిచి, దేవాలయాన్ని కూల్చి సాధించేది ఏమీ ఉండదని చౌడమ్మ యాడి దేవాలయ భూములను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే బక్కన నర్సింహులు,భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబాయ్యలు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ ఫుల్ బ్యూరో సభ్యులు మాజీ ఎమ్మెల్యే "బక్కని నరసింహులు" తదితర భారతీయ జనతా పార్టీ శ్రేణులు కలిసి చౌడమ్మ యాడి, దేవాలయ స్థలాలను, గుట్ట విధ్వంసాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ..

ఎంత చారిత్రాత్మకమైన పురాతమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇక్కడ ఉండేదని చౌడమ్మ గుట్ట హనుమాన్ దేవాలయం పక్కన ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్ర స్థలం ఉండేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గతంలో ఈ వ్యవహారంపై ఇక్కడ వెంచర్ నిర్మిస్తున్న నేపథ్యంలో నిర్వాహకులు దేవాలయాన్ని నేలమట్టం చేశారని, ప్రకృతి సహజ సంపద అయిన గుట్టలను తొలిచి నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం పై గతంలోనే అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ వాళ్లు గుట్టలను ధ్వంసం చేసేందుకు అనుమతి ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ అనుమతులు ఇచ్చిన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమాజంలో దైవానికి మాత్రమే అందరూ భయపడతారని కానీ ఆ దైవాన్ని కూడా నేలమట్టం చేసి బాగుపడరని అన్నారు. దేవాలయాన్ని ఇక్కడ చారిత్రాత్మక ప్రకృతి సంపదలు నాశనం చేసిన వారికి తప్పకుండా దీని






ఫలితం అనుభవిస్తారని ఇప్పటికే అనుభవిస్తున్నారని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నికలకు ముందు ఎన్నో ఆందోళనలు చేశామని కానీ వీరి ప్రవర్తనలో మార్పు రాలేదని ఇప్పుడు మళ్లీ నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య పేలుళ్లతో స్థానిక ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. చౌడమ్మ యాడి దేవాలయ స్థలాలను ప్రకృతి సహజ సంపదను, ధర్మాన్ని కాపాడేందుకు భారతీయ జనతా పార్టీ ఎల్లవేళలా ముందుంటుందని అన్నారు. చౌడమ్మ యాడి స్థలాల కాపాడేందుకు బిజెపి సంసిద్ధంగా ఉందని ఇందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని అనవసరంగా తమపై అబాండాలు వేయొద్దని విజ్ఞప్తి చేశారు. అధికారులు ఇక్కడ సహజ సంపదను నాశనం చేయకుండా వెంటనే బ్లాస్టింగ్లు ఆపివేయాలని లేకపోతే అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో నేత అందే బాబయ్య మాట్లాడుతూ..

ఈ ప్రాంతం ఆధ్యాత్మిక మయమైన ప్రదేశమని ఇక్కడ చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామితో పాటు గిరిజనుల ప్రత్యక్ష దైవం యాడి మాత ఉంటుందని అదేవిధంగా శ్రీ వెంకటేశ్వర స్వామి పురాతన దేవాలయం ఉండేదని తెలిపారు. అయితే వెంచర్ నిర్వాహకులు ఈ ఆలయాన్ని నీలమట్టం చేశారని ఇది బాధాకరమైన విషయమని అందే బాబయ్య అన్నారు. పురాతన ఆలయాలు సహజ సంపద నాశనం చేసే అధికారం వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే ఈ ప్రాంతంపై దృష్టి సారించాలని ఇక్కడ జరుగుతున్న అక్రమ పనులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి హిందూ వాహిని ఇతర విభాగాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## బొగ్గు బ్లాక్ ల వేలాన్ని ఆపాలి.

- కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి .
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దందు ఆదినారాయణ డిమాండ్.

**సీ కే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునిర్.**




తెలంగాణ రాష్ట్రంతో సహా దేశంలో వివిధ రాష్ట్రాల్లో 60 బొగ్గు ఘనులను వేలం వెయ్యటానికి కేంద్ర ప్రభుత్వం మోడీ ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం తహతలాడుతుందని దీని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దందు ఆదినారాయణ డిమాండ్ చేశారు .

తెలంగాణ ఒడిశా చత్తీస్గఢ్ మధ్యప్రదేశ్ ఝూర?ండ్ పశ్చిమబెంగాల్ బీహార్ మహారాష్ట్ర దేశంలో 60 బొగ్గు బ్లాక్ వేలం వేయడానికి ప్రయత్నం జరుగుతుందని దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి ప్రజల ఆస్తులను కారుషోకగా అంబానీ అదానీలకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని వాటిని రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఇవ్వాలని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్న మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని సింగరేణి ప్రైవేట్ పరం చేయమంటూ మన రాష్ట్రానికి చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని సింగరేణి మీద ఈ దేశ ప్రజల మీద ప్రేమ ఉంటే అటివేలన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థను రక్షించుకునేందుకు సింగరేణి కార్మికులతో పాటు ప్రజల సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు సింగరేణి రక్షణ కోసం రక్షణ కోసం పోరాడుతామన్నారు.

## సింగరేణి సంస్థ లో ఫౌండ్రిమాన్ /మౌల్డర్ ట్రైనీ కేటగిరి -1(ఎక్సటర్నల్ ) పోస్టుల్లో 7 లోకల్ పోస్టులు నాన్ లోకల్ కు చట్ట విరుద్ధంగా కేటాయించారు

**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 27,**



2018 ప్రెసిడెంట్ రూల్ లో 95% స్థానికులకు కేటాయించాలని చట్టం ఉంది, కానీ దాన్ని ఉల్లంఘించి రాజ్యాంగ విరుద్ధంగా పోస్టులు నాన్ లోకల్ అభ్యర్థులకు కేటాయించారు, దీనివలన స్థానికులైన లోకల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. దీని గురించి సింగరేణి సి %ు%ఎండీ . బలరాం నాయక్ ఐ ఆర్ ఎస్ ని స్థానిక అభ్యర్థులు వినతి పత్రం అందించారు, దీనిపై స్పందించిన సి %ు%ఎండీ సమగ్ర విచారణ జరిపి స్థానిక అభ్యర్థులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక అభ్యర్థులైన సాయి ప్రశాంత్ రాథోడ్, సందీప్, ప్రవీణ్, వంశీ, సాయిరాం,నవీన్,ఆంజనేయులు, సంతోష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుంది.

## తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ పంచాయతీ రాజ్ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 27:**
బడుగు బలహీన వర్గాల ప్రజలు మరియు రైతన్నలు యువత ఆడబిడ్డలు అందర్నీ దృష్టిలో ఉంచుకొని వారికి అన్ని విధాల సహకరించి ప్రభుత్వం తరఫున విడుదలయ్యే అన్ని సంక్షేమ పథకాలు అందించి వారిని అభివృద్ధిలో తీసుకురావడానికి ఇందిరమ్మ ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ పంచాయతీ రాజ్ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

గురువారం భద్రాచలంలోని గోదావరి వరదలు ముంపునకు గురి అయ్యే గ్రామాలను వరద తాకిడికి గురికాకుండా నూతనంగా నిర్మిస్తున్న కూనవరం రోడ్డులోని కరకట్ట ప్రదేశాలను ఆయన పరిశీలించారు. గోదావరి వరదల ప్రభావం ఎంత మేరకు వస్తే గ్రామాలు ముంపునకు గురి అవుతాయని సంబంధిత సీ ఈ ని అడిగి తెలుసుకుని 33 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న కరకట్ట ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గోదావరి వరదల వలన ఆదివాసి గిరిజన గ్రామాలలోని గిరిజన కుటుంబాలు వరదల వలన చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని దృష్టిలో పెట్టుకొని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. వచ్చే సంవత్సరం ఆగస్టు నాటికి పూర్తి స్థాయిలో కరకట్ట నిర్మాణం పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఉన్న హయాంలో సీతారామయ్య ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయడం జరిగిందని ప్రాజెక్టు నిర్మాణానికి 24 కోట్లు శాంక్షన్ చేయడం జరిగిందని సుమారు రెండు లక్షల 70 వేల ఎకరాలకు నీరందించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన ఆ ప్రాజెక్టుని పూర్తి స్థాయిలో నిర్మాణం చేయకుండా కాలయాపన చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలల వ్యవధిలో మూడు నెలలు ఎంపీ ఎలక్షన్ల కోడ్ ఉన్నందువలన పనులు చేయలేక పోయామని ప్రస్తుతానికి బీద ప్రజానీకానికి ఇబ్బందులు కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించడానికి ట్రయల్ రన్ ప్రారంభించామని అది విజయవంతం అయిందని దాదాపు 15 క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్నామని ఆయన అన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం నాలుగు పంపుల ద్వారా 104 కిలో మీటర్ల నీటి సరఫరాకు ప్రధాన కాలువలు పూర్తి చేశామని ఈ కాలువకు ఏంకూరు వద్ద నాగార్జున సాగర్ కాలువకు అనుసంధానం చేయనున్నామని తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 1.20 లక్షల ఎకరాలకు మొదటి విడతగా సాగునీరు అందించినట్లు తెలిపారు. వచ్చే మూడు సంవత్సరాల లో విడుదల వారీగా సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తిచేసి ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు పాయింట్ 74 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఆయన అన్నారు.

అనంతరం గోదావరి కరకట్ట పక్కన ఉన్న విస్తా కాంప్లెక్స్ దగ్గరలోని పంపింగ్ స్లోయిస్ పాయింట్లు పరిశీలించి వరద ఎక్కువైనప్పుడు ఎన్ని క్యూసెక్కుల నీరు దీని ద్వారా గోదావరి సంబంధిత సీ అని అడిగి తెలుసుకుని ఇక్కడ పర్మినెంట్గా పంపిణీ ఏర్పాటు చేయాలని గేట్లు కూడా నిర్మాణం చేపట్టాలని వర్షాకాలం పోయిన తర్వాత దీనికి సంబంధించిన పనులు ప్రారంభించాలని అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలు గోదావరి వరదలు వచ్చినప్పుడు అధైర్య పడకుండా అధికారులు సూచించిన ప్రకారము వరద తాకిడి రాకముందే అధికారులు చూపిన ప్రదేశాలకు చేరుకోవాలని తప్పకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పిస్తారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్ అశ్వరావు పేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఐటీడీఏ పీవో రాహుల్ సి ఈ శ్రీనివాసరావు ఈ ఈ రాంప్రసాద్ డి ఈ మస్తాన్రావు ఏఈ వెంకటేశ్వరరావు వివిధ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యస్థాపనే ధ్యేయం

- అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం
- ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలకు కట్టుబడే ఉంది - ఆగస్టుకు ముందే రుణమాఫీ
- మిషన్ భగీరథ పేరుతో బిఆర్ఎస్ వేలకోట్లు దండుకుంది.
- రూ.70 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన గత పాలకులు
- సీతారామ జలాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం
- కొత్తగూడెంను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం
- రూ.128.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన చేసి భట్టి - హాజరైన మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, పొంగులేటి




**భద్రాద్రి కొత్తగూడెం సి కె న్యూస్ :**ప్రజా ఆకాంక్షలు, కోర్కెల మేరకు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రంలో రూ.128.48 కోట్ల అభివృద్ధి పనులకు భట్టి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అమృత్ పథకంలో భాగంగా రూ.124.48 కోట్ల మంచినీటి పథకం రూ.4 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల పనుల భూమి పూజ పూర్తయ్యిందని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో ప్రజలు పెద్ద ఎత్తున దగా పడ్డారని, కానీ ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, డా. తెల్లం వెంకట్రావులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎన్నికల సమయంలో ఏవైతే హామీలను ఇచ్చామో వాటిని తూచా తప్పకుండా పాటిస్తామని, ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలవుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేయదని, రైతు భరోసా ఇవ్వదని కొందరు పనిగట్టుకుని ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, ఆరునూరైనా ఆగస్టు కంటే ముందే రుణమాఫీని అమలు చేసి తీరుతామన్నారు. విధి విధానాలు ఖరారైన మరుక్షణమే రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని, ఇది కేవలం ప్రజల కోసమే పనిచేస్తుందని తెలిపారు. రూ.125 కోట్లతో అమృత్ పథకం కొత్తగూడెంలో అవసరం ఉందంటే గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మిషన భగీరథ పేరుతో ఏం చేసిందన్నారు. కేసిఆర్ రూ.42000 కోట్లను ఖర్చుపెట్టిన చూపించి వేల కోట్లు దండుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నీటి యద్దడి ఉందని, భువనగిరి, ఆలేరు, భద్రాద్రి కొత్తగూడెం లాంటి ప్రాంతాల్లో నీరు లేక ప్రజలు అల్లాడి పోతున్నారని, మొన్నటికి మొన్న ట్యాంకర్ల ద్వారా ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అనేక పథకాలు పేరుతో కేసిఆర్ రూ.70 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రప్రజల నెత్తిన అప్పులు కుంపటి పెట్టారన్నారు. సీతారామ ప్రాజెక్టు పేరుతో అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న పథకం రూపురేఖలు మార్చి ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచేశారని, రూ.9 వేల కోట్లను ఖర్చు చేసిన గత పాలకులు ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి కమ్మం జిల్లాతో పాటు నల్గొండ ఇతర జిల్లాల్లో భూములను గోదావరి జలాలు తడుపుతాయని, అయితే సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట తదితర నియోజక వర్గాలకు పెద్దగా లాభం చేకూరడం లేదని స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మా దృష్టికి తీసుకొచ్చారని, అసరరమైతే అదనపు కాల్వలు నిర్మించి కొత్తగూడెం న ఇయోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు నీరందేలా కృషి చేస్తామని చెప్పారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అశ్వాపురం వద్ద పంప్ హౌస్ ఫేస్ 1కు ట్రైల్ రన్ నిర్వహించారని, ఈ సందర్భంగా ఆయన గోదావరి తల్లికి దండాలు పెట్టారని చెప్పారు. కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొత్తగూడెం- పాల్వంచను కలుపుతూ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు తమ దృష్టిలో ఉందని, దానిని పరిష్కరిస్తామని, బైపాస్ రోడ్లు కోసం అటవీ అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడతామని, కొత్తగూడెం థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు స్టేజ్ 1,2,3,4 లు మూతబడి ఉన్నాయని, నీళ్లు, బొగ్గుతో పాటు తదితర వనరులు అందుబాటులో ఉన్న మూలంగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా ప్రాంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్తగూడెం కేంద్రంగా ఐటి హబ్ ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం సింగరేణి యాజమాన్యంతో చర్చలు జరపబోతున్నామని అన్నారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం నియోజకవర్గ ప్రాథమిక అవసరాలను తీరుస్తూ మానవవనరులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తామని చెప్పారు.

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు మంత్రిగా కొనసాగే అవకాశాన్ని ప్రజల తనకు కల్పించారని, తాను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేసి ప్రారంభించానని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ ఫెస్ 1ని ప్రారంభించామని,ప్రాజెక్టు నిర్మాణం కోసం భ భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలలో సశ్యశ్యామలంగా మారేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. విజయవాడ నుండి హైదరాబాద్ వరకు 6 లైన్ల జాతీయ రహదారి అనుమతులు వచ్చాయని, విజయవాడ నుండి జగ్దల్ పూర్ వరకు జాతీయ రహదారి పనులు ప్రారంభిస్తామని, కొత్తగూడెం నుండి వలిగొండ నేషలన్ హై వే పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. కొంత ఆలస్యమైనప్పటికీ రైతు భరోసా డబ్బులు అర్హుల ఖాతాల్లో జమవుతాయని, ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయం పరంగా కొత్తగూడెం జిల్లాను పరుగులు పెట్టిద్దామని, పామాయిల్ కు కేరాఫ్ అడ్రస్ కొత్తగూడెం గా మారుద్దామని, ఇందు కోసం జిల్లాలోని అధికారులంతా సమన్వయంతో మందుకు పోతూ అంతా కలిసికట్టుగా పనిచేద్దామని చెప్పారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా పోరాటాల జిల్లా అని జిల్లా ఇంచార్జ్, రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. భూమి పూజ చేసిన మంచినీటి పథకాన్ని ఆదారు నెలల్లో పూర్తి చేసి ప్రజల చెంతకు చేరుస్తామని చెప్పారు. విజయవాడ నుండి హైదరాబాద్ వరకు జాతీయ రహదారి పనులకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ ఘట్కారితో చర్చించి అనుమతులు తీసుకున్నామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. హైదరాబాద్ నుండి భద్రాచలం వరకు రూ.20200 కోట్లతో మరో జాతీయ రహదారి ఏర్పాటు చేస్తామని, దాని పలుకు కూడా త్వరలో ప్రారంభంకానున్నాయని తెలిపారు. ఇందిరమ్మ, ఇల్లు, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరసా అర్హుల దరి చేరుతాయని, ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు కొందరు తప్పుడు ప్రచారాలు మొదలు పెట్టారని, దానిని ప్రజలు నమ్మొద్దన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రీ డిజైన్ పేరుతో గత పాలకులు సీతారామ పేరు మార్చి వ్యయం పెంచేశారని, రూ.9 వేల కోట్లు వెచ్చించి బూడదలో పోసిన పన్నీరులా చేశారమని పంచాయితీరాజ్, సమాచార శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాయమాటలతో ప్రజలను పదేళ్ల పాటు మోసం చేసిన బిఆర్ఎస్కు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ రాజ్య ఫలాలు అందుతాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఎల్సి పచ్చిపులుసు నవీన్ (తీన్మార్ మల్లన్న), జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, మాజీ ఎంఎల్సి బాలసాని లక్ష్మీ నారాయణ, డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మున్సిపల్ కమీషనర్ శేషాంజన్ స్వామి, ఇంజనీర్లు రవికుమార్, రాము, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మిత్రపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

## వారికీ అవ్వాతాతలుంటారుగా!

యాభైఏళ్ల ఉద్యోగిని... ఆఫీసుకు వెళ్లేందుకు బస్సుకోసం బస్టాప్‌లో నిల్చుని ఉన్నారు. ఇద్దరు పోలీసులు హడావుడిగా వచ్చి, ఇక్కడ నిల్చుని ఉండకూడదు... కూర్చోండి... కూర్చోండి అంటూ ఉద్యోగినితో సహా అక్కడ ఉన్నవారినందరినీ నేలపై కూర్చోమని చెప్పారు. ఎందుకు ఇలా అని అడిగితే, సీఎం వస్తున్నారు కూర్చోండి... కూర్చోండి అంటూ బలవంతంగా కూర్చుండబెట్టేశారు. పక్కకి వెళ్లిపోతాం అన్నా వినకుండా హల్‌చల్ చేశారు. చేసేది లేక సిగ్గుతో చితికిపోయి... రయ్‌మంటూ వాహనాలు దూసుకుపోయే వరకు వారంతా అలాగే కూర్చున్నారు. ఇది కథ కాదు... అనుభవం.

'జనం కోరేది మనం సేయడమా... మనం చేసేది జనం చూడడమా' %-%పాతాళభైరవి సినిమాలో మాంత్రికుని డైలాగ్ ఇది. కానీ, 'పవర్'ఫుల్ డైలాగ్. నేనెంత చేసినా జనం నన్నెందుకు ఇలా చేశారు అనే మాట వచ్చిందంటే ఖచ్చితంగా వారు కోరేది చేయలేదన్న మాటే. తాజా ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మార్పునకు కారణాలు అనేకం అనేది రోజూ చర్చకు వస్తూనే ఉంది. జనం తిరస్కరించిన అధినాయకత్వమైతే అసలు తమను గద్దె దింపడం ఏమిటన్న భావననే వెళ్లగక్కుతూ వస్తోంది. ఇంకా, ద్వితీయ శ్రేణి నాయకగణం 'ఎక్కడా వ్యతిరేకత కనబడలేదు... ఎందుకు ఇలా జరిగిందో తెలియడం లేదు' అంటూ శోకతప్తహృదయాన్ని అధినేత వద్ద ఆవిష్కరిస్తున్నారు. ఫలితాలు వెల్లడై ఇన్ని రోజులు అవుతున్నా ప్రక్షాళన దిశగా చూడకుండా పరనింద కోసం పాకులాడుతున్నవారు తెలుసుకోవలసినవి చాలానే ఉన్నా... వారు మరిచినట్టు నటిస్తున్న కొన్ని అంశాలనైతే ముచ్చటించాల్సి ఉంది.

ఒక్కసారి వెనక్కు చూసుకుంటే, కుర్చీ ఎక్కిన తొలినాళ్లలోనే నమ్మకానికి బీటలు పడ్డాయి. అభివృద్ధి కంటే కక్షసాధింపునకే నాయకుని ప్రాధాన్యం అనేట్టుగా పాలన ప్రారంభమైంది. విడిపోయిన రాష్ట్రంలో వేసిన అభివృద్ధి పునాదులను కూకటివేళ్లతో పెకలించే విధానంపైనే ఆలోచనలు సాగాయి. ప్రజావేదికతో ప్రారంభమైన కూల్చివేతలు నలుదిశలా పాకాయి. రాజధానిపై చేసిన హేళన... పాలన చివరివరకూ కొనసాగి అసలు రాష్ట్రానికి ఒక దిక్కులేకుండా ఉండే పరిస్థితి ఏర్పడింది. మీ రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారంటూ నగుబాటుకు గురికావలసి వచ్చింది. మూడు, మూడు అని సాగదీస్తుంటే జనం నమ్మేస్తున్నారని అనుకున్నారు కానీ, ఒక కన్నేసి ఉంచారని గమనించలేకపోయారు. నెపమంతా వైరిపక్షంవైపు తోసివేసి మార్కులు పడుతున్నాయని భ్రమలో గడిపేశారు కానీ, వాస్తవంలోకి తొంగి చూడలేకపోయారు. ప్రాజెక్టులు, రహదార్లు, ఇతర జనావసరాలకు సంబంధించి వైఫల్యాలపై వేళ్లన్నీ ఒక వ్యక్తివైపే చూపి కాలం వెళ్లబుచ్చారన్న భావన ఉందనే విషయం గ్రహించలేకపోవడం జనం తప్పు కాదుకదా! మొత్తంగా మన నిరంతర శత్రుజపం జనంపై ప్రభావం చూపుతుందనే ఆలోచన తిప్పి కొడుతుందని ఊహించలేకపోవడం కూడా జనం తప్పు కానేకాదు.

అధికారం ఒక ముళ్లకిరీటం... బాధ్యతగా మోయాల్సి ఉంటుంది. తానే కాదు, తన సైన్యం క్రమశిక్షణ బాధ్యతనూ నాయకుడు తీసుకోవలసి ఉంటుంది. భిన్న మనస్తత్వాల శ్రేణుల్ని సమన్వయపరిచి తీర్చిదిద్దే శక్తి నాయకుడికి అవసరం. ప్రజల్లోకి వెళ్లిన అనుచరగణం మాట తూలితే, క్రమశిక్షణ తప్పి ప్రవర్తిస్తే మచ్చ పడేది నాయకునిపైనే. దురదృష్టవశాత్తు ఐదేళ్ల కాలంలో గట్టు తప్పిన దూడలెన్నో! అయితే, మందలించాల్సిన వారు మందహాసం చేస్తుండిపోయారు. తప్పిదాల్ని వెనకేసుకొచ్చారు. మనవాడు కాదనుకుంటే చాలు రచ్చరచ్చ చేసిన వైనం అగ్రనేతల కళ్లల్లో ఆనందబాష్పాల్ని నింపిందేమో కానీ, జనామోదం పొందలేదు. సరికదా ఎల్లెడలా ఛీత్కరించారు. అసలు సైన్యం, ఏర్పాటు చేసుకున్న డిజిటల్ సైన్యం చేసిన అల్లరికి శిక్ష విధించారు. చరిత్రలో కనుమరుగైన రాచరికదర్పాన్ని వర్తమానానికి తీసుకువచ్చిన నాయకులను జనం ఎలా ఆదరిస్తారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాలంటే భయం... ఒక ప్రదర్శన చేయాలంటే వణుకు... సమావేశం పెట్టాలంటే ఏం జరుగుతుందో అన్న సందేహం... ప్రతిపక్ష నేతలే కాదు... ఉద్యోగులు, ప్రజాసంఘాలు, జర్నలిస్టులు ఇలా ప్రజలతో మమేకమైన వర్గాలకు అభద్రతా వాతావరణాన్ని రుచి చూపించిన నేతలు ప్రజలకు ఎలా దగ్గరవుతారు? ఏం చేసినా ఆదుకునేందుకు పైన ఉన్నారు అనే భావనతో చెలరేగిన మూకలను ఆదిలోనే కట్టడి చేయలేకపోయారు. ఘోరనేరాలకు సంబంధించి వాస్తవాలు వెలుగులోకి రాకుండా అడ్డుపడ్డారన్న అపప్రథను మూటగట్టుకున్నారు. జనం క్రైం సీరియల్ చూస్తున్నారని అనుకున్నారేమో గానీ, ముగింపు ఇలా ఉంటుందని ఊహించలేకపోయారు. వ్యక్తులకే కాదు... భూములకూ భద్రత లేని పరిస్థితిని కొని తెచ్చుకున్నారు. టార్గెట్ చేసిన వారిపై కక్షగట్టి, సాధించామని అనుకుంటే... జనం మరోలా అనుకున్నారు. వెరసి కసిగా ఫలితాన్ని అందించారు.

బస్టాప్‌లో ఆత్మాభిమానం దెబ్బతిన్న మహిళ ఒక్కరే కాదు... ఎన్నో సంఘటనల్లో అవమానం, బాధ, గాయాలకు లోనైన వారికీ సంక్షేమ పథకాలు తీసుకుంటున్న అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఉంటారు. వారు ఇళ్లకు వెళ్లి తమ గోడును వెళ్లగక్కితే... 'పోనీలేమ్మా... పెన్షన్లు ఇస్తున్నాడుగా, డబ్బులు వస్తున్నాయిగా... బాధపెడితేనేం, బటన్లు నొక్కుతున్నాడుగా' అంటారా లేక 'వారి పరిభాషలో' శపిస్తారా? అదిగో ఆ శాప ఫలితమే ఇది.

చివరిగా.... ఎప్పుడూ పరదాల మాటున తిరిగే ప్రజాప్రతినిధి ఎన్నికల ముందు చిన్నపిల్లలతో, అవ్వాతాతలతో ముద్దులు, ఆలింగనాలతో కనిపిస్తే, హార్ట్‌టచింగ్ దృశ్యాలను చూపిస్తే నమ్మడానికి జనం వెర్రిబాగులవారు కాదుకదా. ఇంత చిన్నలాజిక్ ఖరీదైన 'ప్యాక్' వారుగాని, వాటిని జనంమీదకు సంధించిన అస్మదీయులు గానీ ఎలా విస్మరించారు.

# కంటి చూపును కాపాడే ఆహారాలు ఇవి..!

### చేపలు, కోడిగుడ్లు మంచివి

### క్యారెట్లు, పాలకూర, బాదం గింజలు తీసుకోవచ్చు

### వీటిల్లో కంటిని కాపాడే ఇంగ్రెడియంట్లు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. మన శరీరంలో కళ్లకు ప్రాధాన్యం ఎంతో ఉంటుంది. కావాల్సిన పోషకాలు అందేలా చూసుకుంటే చాలు.. కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. అలాగే, కంటి నరాలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. మధుమేహం, బీపీ ఉన్న వారు వాటిని నియంత్రణలో పెట్టుకుని, పోషకాహారం అందించడం ద్వారా కంటిచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. పోషకాలంటే విటమిన్ ఏ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందించాలి.

కంటి చూపు ఎందుకు తగ్గుతుంది? అనే దానికి వయసు పెరగడం ఒక కారణం. ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లను గంటల తరబడి చూస్తుంటే కంటికి విశ్రాంతి తగ్గి, నష్టం జరుగుతుంది. ఇవి కాకుండా ఒత్తిడి, పోషకాల లేమితోనూ కంటి చూపు మసకబారుతుంది.



**చేపలు**

కంటికి చేపలు ఎంతో మంచి చేస్తాయి. చేపల్లోనూ సాల్మన్ రకం మంచివి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. కనుక ఇవి చెడు కొవ్వులను తగ్గిస్తాయి. కళ్లు పొడిబారిపోకుండా, రెటీనాకు మేలు చేస్తాయి.

**బాదం గింజలు**

ఆల్మండ్స్ లో విటమిన్ ఈ తగినంత ఉంటుంది. ఇది కంటికి రక్షణనిస్తుంది. వయసు మీరడం వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ నుంచి కాపాడుతుంది. అయితే, రోజులో బాదం గింజలను ఎక్కువ కాకుండా తీసుకోవాలి. అంటే ఒకేసారి మితిమీరి తినకూడదు.

**గుడ్లు**

కోడి గుడ్లలో విటమన్ ఏ, లూటిన్, జియాక్సాంతిన్, జింక్ ఉంటాయి. విటమిన్ ఏ కంటి కార్నియాకు ఎంతో అవసరం. కంటిలో కనిపించే ఉపరితలాన్ని కార్నియాగా పేర్కొంటారు. లూటిన్, జియాక్సాంతిన్ కంటికి సమస్యలు రాకుండా రక్షణనిస్తాయి. రెటీనా ఆరోగ్యానికి జింక్ సాయపడుతుంది.

లూటిన్, జియాక్సాంతిన్ ను మన శరీరం తయారు చేసుకోలేదు. పాలకూరలోనూ ఇవి లభిస్తాయి.

**క్యారెట్లు**

క్యారెట్లలోనూ విటమిన్ ఏ పుష్కలంగా లభిస్తుంది. పైన చెప్పుకున్న ప్రయోజనాలకు అదనంగా, ఇన్ఫెక్షన్ల నుంచి కూడా విటమిన్ ఏ రక్షణనిస్తుంది.

నానబెట్టిన బాదం గింజలను రోజూ ఉదయం తినాలి
పొద్దున్నే నిమ్మరసం కలిపిన నీరు తాగాలి
స్ట్రెచింగ్ వ్యాయామాలతో నూ మంచి ఫలితాలు



# ఇలా చేస్తే.. జీర్ణక్రియకు తిరుగుండదు!

నేడు మారిన జీవనశైలి వల్ల ఎంతో మంది జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మన జీర్ణ వ్యవస్థ శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సంగ్రహిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. నోటి నుంచి పేగుల వరకు ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలతో తిన్నది వంటికి కూడా పట్టదు. బరువు తగ్గుతారు. ఈ సమస్యల నుంచి బయట పడేందుకు, జీర్ణశక్తిని పెంచుకునే ఉపాయాలు ఉన్నాయి.

**బాదం గింజలు**

బాదం గింజల్లో మంచి పోషకాలు ఉంటాయని తెలిసిందే. విటమిన్ ఈ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ప్రొటీన్, ముఖ్యమైన కెమికల్స్, ఫ్లావనాయిడ్, మినరల్స్ ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ కు కారణమవుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. దీంతో గుండె కు కూడా రక్షణ ఏర్పడుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఫలితాల ప్రకారం.. ప్రతి రోజూ బాదం తినడం వల్ల బ్యుటిరేట్ సింథసిస్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిసింది. ఇది షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్. దీనివల్ల పేగుల ఆరోగ్యం బలపడుతుంది. పైగా బాదంలో ఉండే ఫైబర్ కూడా జీర్ణవ్యవస్థకు మంచి చేస్తుంది.

**నిమ్మరసం కలిపిన నీరు**

మనలో ఎక్కువ మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ దీనికి బదులు నిమ్మరసం కలిపిన నీరు తాగి చూడండి. ఇది జీర్ణ వ్యవస్థకు ప్రేరణనిస్తుంది. కడుపుబ్బరం, కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే నిమ్మరసం కడుపులోకి వెళ్లిన తర్వాత అక్కడి నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. నిమ్మలో ఉండే అసిడిటీ జీర్ణ రసాలను ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో తీసుకున్న ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

**వ్యాయామం**

ఉదయం వేళ వ్యాయామం మరో ముఖ్యమైన అంశం. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. యోగా చేసుకోవచ్చు. రక్త ప్రసరణ పెరిగేలా వేగంగా నడవడం, ఏరోబిక్ వ్యాయామాలు, లేదంటే కాళ్లూ, చేతులను కదిలించేవి అయినా చేసుకోవచ్చు. దీనివల్ల కూడా జీర్ణశక్తి బలపడుతుంది. ముక్కు ద్వారా దీర్ఘ శ్వాస తీసుకుని నోటి ద్వారా విడుదల చేసేదీ అనుసరించొచ్చు.

# ఆ భాగంలో నష్రత్ సూపర్ హాట్ టాటూ!

ముంబై బ్యూటీ నష్రత్ బరూచా గురించి పరిచయం అవసరం లేదు. పదేళ్ల క్రితమే టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన నటి. %--%తాజ్ మహల్%--% చిత్రంలో నటించిన అమ్మడికి మళ్లీ తెలుగులో ఛాన్సులే రాలేదు. మళ్లీ సొంత భాషలోనే తెలుగు నటుడైన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బాలీవుడ్ డెబ్యూ ఛత్రపతిలో ఛాన్సు అందుకుని తెలుగులో ప్రచారం పొందింది. అయినా ఏం లాభం ఆ సినిమా వైఫల్యంతో మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. అయితే బాలీవుడ్ లో మాత్రం అమ్మడి కెరీర్ బాగానే సాగింది. ఈ దశాబ్ద కాలంలో తెలుగు ఛాన్సులు రాకపోయినా హిందీ సినిమాలతో బిజీగానే గడిపింది. అమ్మడి ఖాతాలో కొన్ని పెద్ద చిత్రాలున్నాయి. కానీ ఏవి సాలిడ్ హిట్ కాలేదు. దీంతో నష్రత్ ఛాన్సుల వరకే పరిమితమైంది తప్ప! హిట్ నాయిన అని అని పించుకోలేక పోయింది. ఇక సోషల్ మీడియాలోనూ అమ్మడు దూకుడు ఎప్పుడూ పీక్స్ లోనే ఉంటుందని చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫోటోలతో యువతలో సలపరం పుట్టిస్తుంది. ఇన్ స్టా వేదికగా అందాన్ని ఆవిష్క రించడంలో నన్ను కొట్టేది? ఎవరూ అని చాటి చెప్పిన ఫోటో సెషన్స్ ఎన్నో ఉన్నాయి. తాజాగా అమ్మడు మరోసారి టాటూతో చెలరేగింది. టాప్ లో బ్లాక్ బనియన్..బాటమ్ లో తెలుపు రంగు పొట్టి నిక్కరు ధరిం చింది. వేసుకున్న నిక్కరే చిన్న పీలిక లా ఉంది. ఆపీలికను మరింతగా పైకి లేపి సరిగ్గా అదే ప్లేస్ లో హీటెక్కించే టాటూ వేయించింది. వైట్ బ్యూటీ పై బ్లాక్ టాటూ తో మురిపించేస్తోంది. వాల్ సపోర్ట్ తీసుకుని అమ్మడు ఇలా సెల్ఫీ దిగుతూ కెమెరాకి చిక్కింది. %--%నా పచ్చబొట్టు మిస్ అయింది%--%? మీలో కూడా అలాంటి వారున్నారా? అంటూ ఓ కొంటె కామెంట్ పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. నష్రత్ థై షోకి కుర్రాళ్లంతా ఫిదా అవుతున్నారు. అదే రేంజ్ లో కామెంట్ బాక్సులో హాట్ హాట్ కామెంట్లు దర్శనమిస్తున్నాయి.



## సాక్షి మాలిక్ యొక్క చిక్ క్రీమ్ అవుట్‌ఫిట్: ఎ స్టైలిష్ ఎఫైర్



## రకుల్ ప్రీత్ సింగ్ వెర్సటైల్ ఫ్యాషన్‌లో స్టన్స్



## తమన్నా-రాశి.. గ్లామర్ యుద్ధం



ఆరణ్మయి.. తమిళంలో ఫ్రాంఛైజీగా మారిన హార్రర్ కామెడీ మూవీ. తెలుగులో ఎప్పుడో అరగదీసి పక్కన పడేసిన ఈ జానర్‌ను తమిళ దర్శకులు మాత్రం ఇంకా వదిలిపెట్టట్లేదు. ముఖ్యంగా సీనియర్ దర్శకుడు సుందర్.సి అయితే చాలా ఏళ్లుగా ఈ ఫ్రాంఛైజీని నమ్ముకునే కెరీర్‌ను సాగదీస్తున్నాడు. ‘ఆరణ్మయి’ హిట్టయినా.. ఆ తర్వాత వచ్చిన సినిమాలేవీ కూడా గొప్ప ఫలితాలేమీ అందుకోలేదు. కానీ సుందర్ మాత్రం అవే కథలను ఇటు అటు తిప్పి సినిమాలు తీస్తూనే ఉన్నాడు. ‘ఆరణ్మయి’ ఫ్రాంఛైజీలో ఇప్పటికే మూడు సినిమాలు రాగా.. నాలుగో సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ వేసవిలోనే రిలీజ్ పెట్టుకున్నారు. ఈ సినిమాల్లో హార్రర్, కామెడీతో పాటు గ్లామర్ డోస్ కూడా బాగానే ఉంటోంది. ఈ సినిమాలు సేల్ కావడానికి కూడా అదే కారణం. ‘ఆరణ్మయి-3’లో రాశి ఖన్నాను చాలా గ్లామరస్‌గా చూపించి యూత్‌ను మెప్పించాడు సుందర్. ‘ఆరణ్మయి-4’లోనూ రాశి పాత్రను కొనసాగిస్తున్నాడు. ఆమెకు తోడు మిల్కీ బ్యూటీ తమన్నాను కూడా రంగంలోకి దించాడు సుందర్. వీళ్లిద్దరి గ్లామర్ లుక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒకరిని మించి ఒకరు సెక్సీగా కనిపిస్తున్న ఒక పోస్టర్ యూత్ దృష్టిని బాగా ఆకర్షిస్తోంది. రాశి, తమన్నా ఇద్దరి కెరీర్లూ ఇప్పుడు డల్లుగా నడుస్తున్నాయి. ఇంతకుముందుతో పోలిస్తే వారి రేంజ్ పడిపోయింది. మిడ్ రేంజ్ సినిమాలక పరిమితం అవుతున్నారు. అయినా ఇప్పుడున్న రేంజ్ ఇంకా తగ్గకుంటే చాలన్నట్లు ఉంది పరిస్థితి. అందుకే ‘ఆరణ్మయి-4’ లాంటి సినిమాలు క్లిక్ అవడం కీలకం. సినిమాలో ఇద్దరూ ఒకరితో ఒకరు పోటీ పడి గ్లామర్ విందు చేసినట్లు కనిపిస్తోంది. మరి ఈ సినిమాకు వారి గ్లామర్ ఏమేర ప్లస్ అవుతుందో చూడాలి.